بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ

బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

సంపుటి: 11 | www.akhbarbadr.in | సంచిక: 46

సంపాదకులు: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్,
ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్.

తేది: 12 నవంబర్ 2026 క్రీ, శ. 01 జమాదిఉస్సాని 1448 హి,ఖ. 12 నబువ్వత్ 1405 హి, శ.

పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

అల్లాహ్ స్తోత్రముతోనే హృదయములు తృప్తిపడును.

اَلَّذِیۡنَ اٰمَنُوۡا وَتَطۡمَئِنُّ قُلُوۡبُہُمۡ بِذِکۡرِ اللّٰہِ ؕ اَلَا بِذِکۡرِ اللّٰہِ تَطۡمَئِنُّ الۡقُلُوۡبُ ○ (الرّعد:29)

అనువాదం: అనగా విశ్వసించిన వారు, వారి హృదయములు అల్లాహ్ స్తోత్రముతో తృప్తిపడును. వినుడు. అల్లాహ్ స్తోత్రముతోనే హృదయములు తృప్తిపడును.
(అర్రాద్: 29)



మన స్వర్గం మన దేవుడే.

హజ్రత్ అఖ్దస్ మిర్జా గులాంఅహ్మద్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం వారి ఉపదేశం:

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం ఇలా పేర్కొన్నారు:

"మన స్వర్గం మన దేవుడే. మన అత్యున్నతమైన ఆనందాలు మన దేవునిలోనే ఉన్నాయి. ఎందుకంటే మేము ఆయనను దర్శించాము మరియు ప్రతి ఒక్క అందాన్ని ఆయనలోనే కనుగొన్నాము. ఈ సంపద పొంద దగినది. ఇందుకై ఒకవేళ ప్రాణాలను అర్పించాల్సి వచ్చినా సరే!. ఈ అమూల్యమైన రత్నం కొనదగినది. ఇందుకై ఒకవేళ సమస్త అస్తిత్వాన్ని కోల్పోయి పొందాల్సి వచ్చినా సరే!. ఓ వంచితులారా! ఈ ఊట వైపు పరుగెత్తండి. ఇది మీకు దాహార్తిని తీర్చి తృప్తిపరుస్తుంది. ఇది జీవన జలధార, మిమ్మల్ని రక్షిస్తుంది. నేను ఏమి చేయాలి? ఈ శుభవార్తను ప్రజల హృదయాలలో ఎలా నాటాలి?. మీ దేవుడు ఈయనే అని ప్రజలకు వినిపించడానికి ఏ డప్పు కొట్టి వీధుల్లో చాటింపు వేయాలి, తద్వారా ప్రజలు వినగలుగుతారు?. ఆలకించుటకై ప్రజల చెవులు తెరుచుకోవ డానికి ఏ ఔషధంతో చికిత్స చేయాలి?" **(కిష్తీ నూహ్, రూహానీ ఖజాయిన్, సంపుటి 19, పేజీలు 21-22)**

మరల ఇలా పేర్కొన్నారు: "ఒకరి అస్తిత్వం అత్యంత తీవ్ర స్థాయిలో అవసరమైనదిగా భావించబడినప్పుడు, అతడే ఆరాధ్యుడిగా మారుతాడు. అటువంటి అస్తిత్వం కేవలం అల్లాహ్ తఆలాకే చెందుతుంది. ఆయనకు ఎవరూ సాటిలేరు, ప్రత్యామ్నాయమూ లేరు. ఏ మానవుని విషయంలోనూ లేదా ఇతర సృష్టి విషయంలోనూ ఈ విధంగా చెప్పలేము." **(మల్ఫూజాత్, సంపుటి 8, పేజీ 165, 1984 ఎడిషన్)**

"మానవ జన్మ యొక్క ముఖ్య ఉద్దేశం అల్లాహ్ తఆలాను స్మరించుకోవడం మరియు ఆయన ధ్యానం చేసుకోవడమే.

హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్, ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహ్ అన్హు ఇలా పేర్కొన్నారు: : "మానవ జన్మ యొక్క ముఖ్య ఉద్దేశం అల్లాహ్ తఆలాను స్మరించుకోవడం మరియు ఆయన ధ్యానం చేసుకోవడమే. ఎందుకంటే, ఒకసారి మనిషికి అల్లాహ్ ప్రాప్తి లభించినప్పుడు అతనిలో ఎలాంటి అసూయ, ఆరాటం లేదా తపన వంటివి మిగిలి ఉండవు. పైగా అతడు సంతృప్తిని పొందుతాడు. ప్రాపంచిక విషయాల అన్వేషణలో నిమగ్నమై ఉండే వ్యక్తులకు ఎంత ఎక్కువ అభివృద్ధి లభిస్తుందో, వారిలో అంత కంతకూ అసంతృప్తి, ఆరాటం పెరుగుతూ ఉంటాయి. అయితే అల్లాహ్ తఆలా వైపు పయనించే వ్యక్తికి, ఎంతో ఎక్కువగా ఆయన వైపు దృష్టి సారించే వ్యక్తికి, అంత కంతకూ అతని హృదయంలో ప్రశాంతత పెరుగుతూ ఉంటుంది. తద్వారా అల్లాహ్ తఆలా తన సాన్నిధ్యాన్ని అన్వేషించడాన్నే మన జీవితానికి అసలైన లక్ష్యంగా నిర్ణయించాడని స్పష్టమవుతుంది. కాబట్టి, ఆ లక్ష్యం నెరవేరినప్పుడు మనిషికి నిజమైన ప్రశాంతత లభిస్తుంది. మన రాజ్యాలనే ఉదాహరణగా తీసుకోండి. వాటి రక్షణ ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పటికీ, కొందరు రాజులకు, ఉన్నతాధికారులకు భయం ఎంత ఎక్కువగా ఉంటుం దంటే, విదేశాల నుంచి మూసివేసిన పాత్రల్లో నీరు తెప్పిస్తారు. ఆ నీటిని వారి ముందు తెరిచినా, ముందుగా ఇతరులకు త్రాగడానికి ఇచ్చిన తరువాతే రాజుగారు త్రాగుతారు. అలాగే వారి ఆహారం విషయంలోనూ అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. వండిన ఆహారాన్ని ముందుగా వండిన వ్యక్తికే తినిపిస్తారు. ఆ తరువాత వైద్యుడు దానిని తింటాడు. ఆ తరువాతే అది వారి ముందు వడ్డించబడుతుంది. అంటే, వారికి ప్రతి క్షణం ఏదో ఒక ప్రమాదం పొంచి ఉన్నట్లుగా ఉంటుంది. అందుకే నిరంతరం అనేక జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు. వారి జీవితాల్లో ప్రతి క్షణం ఆందోళన, అశాంతి నెలకొని ఉంటాయి. కానీ మన ప్రియతమ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవితాన్ని చూడండి. నలువైపుల శత్రువులే ఉన్నప్పటికీ, వారికి ఎన్నడు ఎలాంటి భయం ఉండేది కాదు. పైగా వారు(స) ఎంతో ప్రశాంతంగా, ఆనందంగా ఉండేవారు. శత్రువులు సైతం భోజనానికి ఆహ్వానిస్తే, ఏమాత్రం సంకోచించకుండా వారి ఆహ్వానాన్ని స్వీకరించేవారు. ఒకసారి ఒక యూదురాలు ప్రవక్త (స)కు విషం కలిపిన ఆహారాన్ని ఇచ్చింది. అయినప్పటికీ, అల్లాహ్ తఆలా ఇచ్చిన దైవవాణితో ఆ విషయం ప్రవక్త (స)కు తెలిసి పోయింది. తద్వారా వారు (స) ఆ ప్రమాదం నుంచి రక్షించ బడ్డారు. (సీరతున్నబీ, ఇబ్నె హిషామ్, 'అమరే ఖైబర్' అనే శీర్షిక కింద). వారికి అంతటి ప్రశాంతత ఎందుకు లభించేది.? దానికి కారణం, సర్వ అగోచర విషయాలను తెలిసిన అల్లాహ్ తఆలాతో వారు (స) తన సంబంధాన్ని ఏర్పరచుకున్నారు. ఒక వ్యక్తికి అటువంటి దివ్య శక్తి కలిగిన అస్తిత్వంతో సంబంధం ఏర్పడినప్పుడు, అల్లాహ్ తన అగోచర జ్ఞానం నుంచి అవసరాన్ని బట్టి ఆ వ్యక్తికి కూడా తెలియజేస్తూ ఉంటాడు. అందువల్ల అల్లాహ్‌తో సంబంధం కలిగి ఉన్న వ్యక్తి ఎల్లప్పుడూ ప్రశాంతంగా ఉంటాడు."
(తఫ్సీర్ కబీర్, సంపుటి 5, పేజీ 67, సూరహ్ రఅద్)



ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు:

ఈ మూడు లక్షణాలు ఉన్న వ్యక్తి ఈమాన్ (విశ్వాసం) యొక్క మాధుర్యాన్ని ఆస్వాదించినట్లే.

عَنْ أَنَسٍ رَضِيَ اللهُ عَنْهُ، عَنِ النَّبِيِّ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ، قَالَ: "ثَلَاثٌ مَنْ كُنَّ فِيهِ وَجَدَ حَلَاوَةَ الْإِيمَانِ، أَنْ يَكُونَ اللهُ وَرَسُولُهُ أَحَبَّ إِلَيْهِ مِمَّا سِوَاهُمَا، وَأَنْ يُحِبَّ الْمَرْءَ لَا يُحِبُّهُ إِلَّا لِلّٰهِ، وَأَنْ يَكْرَهَ أَنْ يَعُودَ فِي الْكُفْرِ كَمَا يَكْرَهُ أَنْ يُقْذَفَ فِي النَّارِ"

[صحيح البخاري/ كتاب الإيمان/حديث: 16]

అనువాదం: హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) గారు ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:ఈ మూడు లక్షణాలు ఎవరిలో ఉంటాయో, అతను ఈమాన్ (విశ్వానం) యొక్క మాధుర్యాన్ని ఆస్వాదించినట్లే. మొదటిది: అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అతనికి అందరికంటే ఎక్కువ ప్రియమైన వారై ఉండాలి. రెండవది: ఒక వ్యక్తిని కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసం మాత్రమే ప్రేమించాలి. మూడవది: అగ్నిలో పడవేయబడటాన్ని ఎంత అసహ్యించుకుంటాడో, అలాగే అవిశ్వాసంలోకి తిరిగి వెళ్లడాన్ని కూడా అంతే అసహ్యించుకోవాలి.
(సహి బుఖారి, కితాబుల్ ఈమాన్/ హదీస్ 16)

(అహ్మదియ్య వార్తలు)

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యద హుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ తాలా కృపతో క్షేమంగా ఉన్నారు. జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్య వంతమైన, చురుకైన, దీర్ఘాయుష్షును ప్రసాదించు గాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చు గాకా!, అనుక్షణం హుజూర్‌ను రక్షించుగాకా!, దేవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్)*

اَللّٰهُمَّ اَيِّدْ اِمَامَنَا بِرُوْحِ الْقُدُسِ
وَبَارِكْ لَنَا فِيْ عُمْرِهٖ وَاَمْرِهٖ۔

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి ఆఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రొపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

సంపాదకీయం: لَا إِلٰهَ إِلَّا اللّٰهُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰهِ

హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు బ్రిటన్ జల్సా సాలానా 2026 సందర్భంగా సభ్యులను ఉద్దేశించి చేసిన విశ్వాసభరిత ముగింపు ప్రసంగపు సారాంశం.

తషహుద్, తవూజు మరియు సూరహ్ ఫాతిహా పఠించిన తరువాత, హుజూర్ అన్వర్ గారు ఇలా ప్రసంగించారు:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి నిజమైన సేవకుడైన మసీహ్ మరియు మహదీ (అలైహిస్సలాం)ను ప్రపంచంలో ఇస్లాం బోధనలను వ్యాప్తి చేయడానికి పంపబడిన ఈ కాలంలో మనలను కూడ పుట్టించి అల్లాహ్ తాలా మనపై తన అనుగ్రహాన్ని కురిపించాడు. అవతరించిన ఈ మసీహ్ మరియు మహదీ (అలైహిస్సలాం) తన శాయశక్తులా ఒక సమాజాన్ని సృష్టించవలసి ఉంది, అందులో ప్రతి వ్యక్తి తనలో పరిపూర్ణ ఏకేశ్వరవాదం కోసం ప్రయత్నిస్తూ, బహుదేవతారాధన నిర్మూలన కోసం పాటుపడడమే కాకుండా, ప్రపంచాన్ని ఏకైక దేవుని పతాకం క్రిందకు తీసుకురావడానికి కూడా కృషి చేయవలసియున్నది.

కాబట్టి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఈ ప్రయోజనం కోసం ఒక స్వచ్ఛమైన సమాజాన్ని స్థాపించి, తన అనుచరుల నుండి పది షరతులపై విధేయత ప్రమాణం తీసుకున్నారు. జమాఅత్‌లోకి ప్రవేశించేటప్పుడు మనం ఈ బైఅత్ వాక్యాలనే పఠిస్తాము.

హుజూర్ (అ) తీసుకున్న బైఅత్ ప్రమాణం ఈ క్రింది వాటిపై ఆధారపడి ఉంది: నేను సమాధిలోకి చేరే వరకు బహుదేవతారాధనకు దరిదాపుల్లోకి కూడా వెళ్ళను. నేను అబద్ధం, వ్యభిచారం, చెడు దృష్టి, అనైతికత, అణచివేత, ద్రోహం, అవినీతి మరియు తిరుగుబాటుకు దూరంగా ఉంటాను. నాకు తీవ్రమైన కోరిక కలిగినప్పుడు నేను వాటికి లొంగిపోను. నేను ఆధ్యాత్మిక పురోగతి కోసం ఐదు పూటల నమాజులకు కట్టుబడి ఉండటమే కాకుండా, తహజ్జుద్ నమాజును కూడా చేయడానికి ప్రయత్నిస్తాను. నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పై దురూద్ పంపుతాను మరియు ప్రతిరోజూ నా పాపాలకు క్షమాపణ కోరతాను. నేను సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క అనుగ్రహాలను స్మరించుకుంటాను మరియు ఆయనను స్తుతిస్తాను. నేను తీవ్రమైన కోరికల ద్వారా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క సృష్టికి, ముఖ్యంగా ముస్లింలకు ఎటువంటి హాని కలిగించను. నేను చెడు అలవాట్లు, కోరికలు మరియు కామ వాంఛలకు దూరంగా ఉంటాను. నేను అహంకారాన్ని విడిచిపెట్టి, వినయం, మంచి స్వభావం, సౌమ్యత మరియు పేదరికాన్ని అలవరచుకుంటాను మరియు నా జీవితం, సంపద, గౌరవం మరియు పిల్లల కంటే ఇస్లాం మతం యొక్క గౌరవం మరియు కరుణను మరింత ప్రియమైనవిగా భావిస్తాను. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఏ నిర్ణయం తీసుకున్నా, నేను దానిని మనస్ఫూర్తిగా అంగీకరిస్తాను.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా మరల ఇలా తెలిపారు:

ఇక్కడ ఖలీఫా పట్లకూడ సంపూర్ణ విధేయత కూడా ఉంది, ఎందుకంటే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వాగ్దానాల ప్రకారం, ఖిలాఫత్ కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి కార్యాలను ముందుకు తీసుకువెళ్ళడానికే ఉద్దేశించబడింది.

హుజూర్ అన్వర్ ఇలా అన్నారు, నేను ఈ విషయాన్ని ఇప్పటికే వివరించాను మరియు అది పుస్తక రూపంలో ప్రచురించబడింది, కానీ ఈ విషయం యొక్క ప్రాముఖ్యత దృష్ట్యా, నేను ఈ రోజు దాని గురించి మళ్ళీ కొంత వివరిస్తాను.

బైఅత్ యొక్క మొదటి షరతు బహుదేవతారాధనను విడిచిపెట్టడం. ఈ విషయంలో, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా తెలిపారు: మానవ జన్మ యొక్క నిజమైన ప్రయోజనం మరియు లక్ష్యం దేవుని సేవకుడిగా మారడమే... అనేక పాపాలు ఉన్నప్పటికీ మరియు వాటికి అనేక శాఖలు ఉన్నప్పటికీ... అతిపెద్ద పాపం... బహుదేవతారాధన. ఒక దురదృష్టవంతుడు దీనిలో (బహుదేవతారాధనలో) ఎంత ఎక్కువగా మునిగిపోతే, అతను తన అసలు హక్కు నుండి అంత దూరం అవుతాడు. చివరికి, అతను కింద పడిపోయి, కష్టాలు, ఇబ్బందులు మరియు అన్ని రకాల బాధలు, దుఃఖాలకు నిలయమైన ఒక అధమ ప్రదేశంలో పడిపోతాడు, దానినే నరకం అని కూడా అంటారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారు కూడ బైఅత్ తీసుకున్నప్పుడు, బహుదేవతారాధనను పూర్తిగా విడిచిపెట్టాలనే షరతుపై బైఅత్ తీసుకునేవారు. అందువల్ల, మన బైఅత్ ప్రమాణం నుండి మనల్ని దూరం చేసే ఏ చర్యకైనా మనం ఎల్లప్పుడూ దూరంగా ఉండటానికి ప్రయత్నించాలి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా తెలిపారు: అన్ని రకాల బహుదేవ తారాధనను విడిచిపెట్టాలి. సూర్యుడిని గానీ, చంద్రుడిని గానీ, ఆకాశంలోని నక్షత్రాలను గానీ, గాలిని గానీ, అగ్నిని గానీ, నీటిని గానీ, లేదా భూమిపై ఉన్న మరే ఇతర వస్తువును గానీ దేవుళ్లుగా పరిగణించకూడదు. అలాగే, ప్రపంచ వస్తువులను దేవునికి భాగస్వాములుగా భావించి వాటిపై దైవ సమానమైనటు వంటి గౌరవాన్ని, నమ్మకాన్ని ఉంచకూడదు. తన సొంత ధైర్యాన్ని, ప్రయత్నాన్ని గొప్పగా పరిగణించ కూడదు, ఎందుకంటే అది కూడా ఒక రకమైన బహుదేవతారాధనే.

బహుదేవతారాధనను ఖండించే సూరా ఇఖ్లాస్ గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా పేర్కొన్నారు: ఇది ఒక చిన్న సూరా, ఇది మానవుడిని అన్ని రకాల బహుదేవతారాధన నుండి చాలా సున్నితంగా దూరం చేసింది మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క సౌందర్యాన్ని పవిత్రం చేసింది.

ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి కుమారుడైన హజ్రత్ ఇబ్రాహీం మరణించినప్పుడు, సూర్యగ్రహణం ఏర్పడింది. హజ్రత్ ఇబ్రాహీం మరణం కారణంగానే గ్రహణం పట్టిందని ప్రజలు అన్నారు, కానీ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: సూర్యచంద్రులు సర్వశక్తి మంతుడైన అల్లాహ్ యొక్క సంకేతాలలో భాగం. అవి ఎవరి జీవితం లేదా మరణం కారణంగా గ్రహణానికి గురికావు.

ఒకానొక చోట హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా పేర్కొన్నారు:

బహుదేవతారాధన మూడు రకాలు: మొదటిది సాధారణంగా విగ్రహారాధన. రెండవది కారకాల (సాధనాల) పై మితిమీరి ఆధారపడటం. మూడవ రకం బహుదేవతారాధన, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఉనికి ముందు తన ఉనికిని గొప్పగా భావించడం.

ప్రాపంచిక అభివృద్ధి యుగంలో, సాధనాల రూప బహుదేవతారాధన చాలా పెరిగింది. మరల ఇలా తెలిపారు: "అల్లాహ్ తప్ప వేరే దేవుడు లేడు" ఇది ఏకదైవారాధన యొక్క వాక్యం, అంటే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తప్ప మరెవరూ ఆరాధనకు మరియు నిజమైన విధేయతకు అర్హులు కారు. ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దేవుని నుండి ఆ ఆదేశాలను స్వీకరించి, వాటిని ప్రాణకోటికి తెలియజేస్తారు, మరియు అక్కడి నుండి వచ్చేదంతా ఈ మార్గం నుండే వస్తుంది.

హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు: మనం చేసే ప్రతి పని, మాట్లాడే ప్రతి మాట, అవి మనల్ని దేవుని నుండి దూరం చేసి, షైతాన్‌కు దగ్గర చేయకుండ ఉండాలనే విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచు కోవాలి.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం)కు విజయాలను చేకూర్చుతానని వాగ్దానం చేసాడు మరియు ఆయన వాటిని తప్పకుండా నెరవేర్చుతాడు, కానీ మనం కూడా చిత్తశుద్ధితో ఉండి, ఈ విజయాలలో భాగం కావాలనుకుంటే అల్లాహ్ ఏకత్వాన్ని ప్రకటించాలి.

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (రజి) ఇలా పేర్కొన్నారు:

"ఓ అహ్మదీ ప్రజలారా! అల్లాహ్ మన బంధువు కాదు. బహుదైవారాధనను విడిచిపెట్టి, ఆయన్నే ఆరాధించండి, తద్వారా ఆయన మీకు రక్షకుడిగా ఉంటాడు. చూడండి! అల్లాహ్ నూహ్ (అ) కుమారుడిని కూడా పట్టించుకోలేదు. దానికి బదులుగా, మీరు ఒక అహ్మదీగా ఉండటానికి అర్హులని నిరూపించుకునే విధంగా ప్రవర్తించండి.

హజ్రత్ లుక్మాన్ (అ) కూడా తన కుమారుడికి రహస్య బహుదైవారాధనను విడిచిపెట్టమని సలహా ఇచ్చారు. హజ్రత్ అన్వర్ ముస్లింల వాస్తవ పరిస్థితిని ప్రస్తావిస్తూ, వారు 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అనే పదాన్ని పఠించినప్పటికీ, వివిధ రకాల బహుదైవారాధనలో చిక్కుకుపోతున్నారని తెలిపారు.

బహుదైవారాధనలో ఒక రకం అబద్ధాలు పలకడం. ఈ రోజుల్లో, అబద్ధం చెప్పకుండా ఏ పని చేయలేమనని ప్రజలు భావిస్తున్నారు. తపాలా కార్యాలయంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)కు ఎదురైన ఒక ఉదంతాన్ని హజ్రత్ అన్వర్ ప్రస్తావించారు. అందులో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా అన్నారని తెలిపారు: "నిజం మాట్లాడితే తప్పించుకోవడం సాధ్యం కాదని ప్రజలు అనుకుంటారు, కానీ నేను నిజం మాట్లాడాను మరియు అల్లాహ్ నన్ను రక్షించాడు."

హజ్రత్ అన్వర్ ఇలా తెలిపారు: ఈ రోజుల్లో అబద్ధాలు చెప్పే సందర్భాలు చాలా ఉన్నాయి, మనం వాటి నుండి తప్పించుకోవాలి. మనం గమనిస్తే, అబద్ధం చెప్పడం ప్రకృతికి విరుద్ధం. కానీ ఈ రోజు ప్రపంచంలోని రాజకీయ పరిస్థితి అబద్ధాలు ఎలా చెప్పబడుతున్నాయో చూపిస్తోంది, దేశాలు అబద్ధాల ఆధారంగా ఏకమై ఒకదానిపై ఒకటి దాడి చేసుకుంటున్నాయి. కాబట్టి

ఈ రోజు మనం మన బైఅత్ ప్రమాణాన్ని నెరవేర్చి, ప్రపంచంలో విప్లవాన్ని తీసుకు రావాలంటే, అబద్ధాలకు వ్యతిరేకంగా జిహాద్ చేయడం అహ్మదీయుల బాధ్యత.

ఇక మరొక చెడు, చెడు దృష్టి. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా పేర్కొన్నారు: మీరు నా బైఅత్ చేసినట్లయితే ఎవరిని తప్పుడు దృష్టితో చూడవద్దు. పవిత్ర ఖుర్ఆన్ క్రైస్తవ బోధన వలే మీరు ఒక స్త్రీని చెడు దృష్టితో చూడవద్దని అని మాత్రమే చెప్పదు. నిజానికి పవిత్ర ఖురాన్ ఇలా చెబుతుంది: మీరు ఏ స్త్రీని ఓర దృష్టితో గానీ, కామ దృష్టి లేకుండా గానీ చూడవద్దు, అలాగే మీ ఆలోచనలను తప్పుడు మార్గంలోకి నడిపించే ఆమె మృదువైన మాటలను వినవద్దు. అప్పుడే మీరు తడబాటును నివారించగలరు.

హుజూర్-ఎ-అన్వర్ ఇలా పేర్కొన్నారు: నేటి సమాజంలోని ఈ దురాచారాల కారణంగా చాలా మంది చెడు పనులలో చిక్కుకుంటున్నారు మరియు వారి గృహాలు కూడా విచ్ఛిన్నమవుతున్నాయి. ఈ రోజుల్లో, అభివృద్ధి చెందిన దేశాలలో విద్యావంతులైన మహిళలు కూడా దీనిపై అవగాహన పెంచుకున్నారు మరియు తమ గౌరవాన్ని కాపాడటానికి ఏదైనా చట్టం చేయాలని వారు కూడా ఆందోళన చేస్తున్నారు. కాబట్టి! ఈ దురాచారాలకు వ్యతిరేకంగా జిహాద్ చేయడం అహ్మదీయుల కర్తవ్యం.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా పేర్కొన్నారు: పవిత్రంగా ఉండటానికి ఐదు విషయాలు ఉన్నాయి.

మొదటిది: మహ్రమ్ కాని (రక్త సంబంధీకులు కాని) వారిని చూడకుండా మీ కళ్ళను కాపాడుకోండి. **(9వ పేజీలో చదవగలరు)**



జుమా ప్రసంగము

"అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే, మనకు ప్రాణాన్ని, ఆరోగ్యాన్ని, శక్తిని, శాంతిని ప్రసాదించి, విశ్వాస ప్రచారానికి అవసరమైన సాధనాలను కల్పించిన అల్లాహ్‌కు కృతజ్ఞులమై ఉండటం. నిజం చెప్పాలంటే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు ప్రసాదించిన ఈ అనుగ్రహాలను ఎవరైనా లెక్కించడానికి ప్రయత్నిస్తే, అల్లాహ్ యొక్క ఆ ఉపకారాలను, దీవెనలను లెక్కించడం మనకు ఏమాత్రం సాధ్యం కాదు."

"ఓ సర్వలోకాల ప్రభూ! నీవు అనుగ్రహించిన వాటన్నిటికీ నీకు కృతజ్ఞతలు చెప్పడం నా శక్తికి మించినది. నీవు అత్యంత దయామయుడవు మరియు కరుణామయుడవు, మరియు నీవు నాకు ప్రసాదించిన అనుగ్రహాలు అసంఖ్యాకమైనవి. నేను నాశన మవకుండా నా పాపాలను క్షమించు.

సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 14 ఆగష్టు జులై 2026 (14 జహూర్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ- بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيمِ-

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ۙ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

గత ప్రసంగాలలో, కృతజ్ఞతను వ్యక్తపరచడం గురించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బోధనలను, అలాగే ఈ విషయంలో వారు (స) స్వయంగా చూపిన ఆదర్శాన్ని గురించి నేను ప్రస్తావించాను. ఈ రోజు, నేటి కాలంలో ప్రవక్త (స) వారి అత్యంత అభిమాని (అ)ఆ బోధనలోని అత్యున్నత ప్రమాణాలను ఎలా అర్థం చేసుకున్నారో, మరియు వివిధ సందర్భాలలో, వివిధ సందర్భోచిత ఉదాహరణల ద్వారా దానిని ఎలా వివరించారో తెలియజేస్తాను. అదేవిధంగా, వారు (అ) స్వయంగా ఈ విషయాన్ని ఎలా ఆచరించారో, తన ఇంట్లోని పిల్లలకు ఈ విషయంలో ఎటువంటి మార్గనిర్దేశం చేశారో మరియు ఒక అహ్మదీ నుండి వారు (అ) ఏమి ఆశించారో కూడా వివరిస్తాను. ఈ అంశాలన్నీ నేటి కాలంలో మనకు మార్గదర్శక సూత్రాలుగా ఉన్నాయి.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలకు కృతజ్ఞత కలిగి ఉండటం యొక్క ప్రాముఖ్యతను మరియు అందులోని అంతరార్థాన్ని వివరిస్తూ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా పేర్కొన్నారు: "ఒక వ్యక్తి ఉన్నత పదవిని పొందినప్పుడు, అతను అహంకారిగా మారిపోతాడు. నిజానికి, ఆ పదవిలో ఉన్న సమయంలో అతను ఎంతో మంచి పనులు చేస్తూ మానవాళికి ఎంతో మేలు చేయగలడు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో ఇలా పేర్కొన్నాడు.

ల ఇన్ షకర్తుమ్ ల అజీదన్నకుం వల ఇన్ కఫర్తుమ్ ఇన్న అజాబీ లషదీద్ (ఇబ్రాహీం:8) అనగా "'మీరు నాకు కృతజ్ఞతలు చెల్లిస్తే, నేను మీకు మరిన్ని అనుగ్రహాలను ప్రసాదిస్తాను. కానీ మీరు కృతజ్ఞత లేనివారిగా ఉంటే, నా శిక్ష చాలా కఠినమైనదని తెలుసుకోండి.' అంటే, ఒక వ్యక్తికి దేవుని అనుగ్రహాలు లభించినప్పుడు, అతను అందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలపాలి మరియు ప్రజలకు ఎలా మేలు చేయగలనో ఆలోచించాలి. ఒకవేళ ఎవరైనా అలా చేయకుండా, దానికి బదులుగా అణచివేతతో లేదా దుర్మార్గంగా ప్రవర్తిస్తే, అప్పుడు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆ అనుగ్రహాలను తొలగించి, తన ఆగ్రహాన్ని కురిపిస్తాడు."

(మల్ఫూజాత్ సంపుటి 10, పుట 200, ఎడిషన్ 2022)

మరొక సందర్భంలో, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు: "అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే, మనకు ప్రాణాన్ని, ఆరోగ్యాన్ని, శక్తిని, శాంతిని ప్రసాదించి, విశ్వాస ప్రచారానికి అవసరమైన సాధనాలను కల్పించిన అల్లాహ్‌కు కృతజ్ఞులమై ఉండటం. నిజం చెప్పాలంటే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు ప్రసాదించిన ఈ అనుగ్రహాలను ఎవరైనా లెక్కించడానికి ప్రయత్నిస్తే, అల్లాహ్ యొక్క ఆ ఉపకారాలను, దీవెనలను లెక్కించడం మనకు ఏమాత్రం సాధ్యం కాదు." **(మల్ఫూజాత్ సంపుటి 10, పుట 330-331, ఎడిషన్ 2022)**

మరొక సందర్భంలో,హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు: "ముస్లింలు అల్లాహ్ తాలాకు ఎంతో కృతజ్ఞులై ఉండాలి. ఎందుకంటే అతడు వారికి సిద్ధాంతపరంగా మరియు ఆచరణాత్మకంగా, ఏ విధమైన కలుషితాలు, అసహ్యకరమైన విషయాలు లేదా లోపాలు లేని స్వచ్ఛమైనటువంటి ధర్మాన్ని ప్రసాదించాడు . ఎవరైనా లోతుగా, నిశితంగా ఆలోచిస్తే, నిజానికి సర్వ స్తుతులు మరియు గుణాలు అల్లాహ్‌కే చెందుతాయని వారికి అర్థమవుతుంది. నిజమైన అర్థంలో, ఏ మానవుడు లేదా మరే ఇతర సృష్టి కూడా స్తుతికి లేదా ప్రశంసకు అర్హులు కాదు. ఎవరైనా స్వార్థపూరిత ఉద్దేశాలు లేకుండా పరిశీలిస్తే, ఒక వ్యక్తిని స్తుతికి అర్హుడిగా పరిగణించాలంటే, ఆ వ్యక్తి ఏమీ లేని, పదార్థం లేదా ఉనికి ఏదీ లేని కాలంలో వాటిని సృష్టించి ఉండాలని స్పష్టమవుతుంది. లేదా, ఏమీ లేని కాలంలో, ఒక వస్తువును ఉనికిలోకి తీసుకురావడానికి, దానిని కాపాడటానికి, దాని ఆరోగ్యాన్ని సంరక్షించడానికి మరియు దాని జీవనాన్ని కొనసాగించడానికి అవసరమైన సాధనాలు, మూలకాలు ఏవీ తెలియని స్థితిలో, ఎవరైనా ఆ అవసరమైన సాధనాలన్నింటినీ సమకూర్చి ఉండాలి. లేదంటే, ఈ సృష్టి అనేక విపత్తులకు గురయ్యే అవకాశం ఉన్న సమయంలో, ఎవరైనా దానిపై దయ చూపి, దానిని రక్షించి ఉండాలి. ఇంకా చెప్పాలంటే, ఒక వ్యక్తి కష్టపడి పనిచేసినప్పుడు, ఆ శ్రమ వృథా కాకుండా కాపాడి, వారికి దక్కాల్సిన హక్కులను పూర్తిగా చెల్లించే వ్యక్తిని కూడా స్తుతికి అర్హుడిగా భావించవచ్చు. ఒక కార్మికుడికి అతని హక్కులను చెల్లించడం అనేది కేవలం తగిన ప్రతిఫలం మాత్రమే అయినప్పటికీ, ఇతరుల హక్కులను కూడా పూర్తిగా నెరవేర్చే వ్యక్తిని ఒక ఉపకారిగా పరిగణించవచ్చు."

ఇవి కొన్ని ప్రత్యేక లక్షణాలు; ఇటువంటి లక్షణాలు ఉండి, ఆ తర్వాత ఒక వ్యక్తి ఇతరులకు సహాయం చేసినప్పుడు మాత్రమే, అతను నిజంగా స్తుతికి అర్హుడవుతాడు. మరల ఇలా అన్నారు: "ఇవి అత్యున్నత స్థాయి లక్షణాలు. ఇవి ఒక వ్యక్తిని ప్రశంసలకు, కొనియాడదగిన స్థితికి అర్హునిగా చేయగలవు. ఇప్పుడు ఆలోచించి చూడండి, వాస్తవానికి, ఈ లక్షణాలన్నింటికీ నిజంగా అర్హుడు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మాత్రమే." నేను పేర్కొన్న ఈ మూడు-నాలుగు లక్షణాలకు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మాత్రమే అర్హుడని వారు (అ) చెబుతున్నారు. " ఆయన ఒక్కడే ఈ లక్షణాలను పరిపూర్ణంగా కలిగి ఉన్నాడు. మరెవరిలోనూ ఇటువంటి లక్షణాలు కనిపించవు."

(రుయిదాద్ జల్సా దువా, రుహోని ఖజాయిన్, సంపుటి 15, పుటలు 597-598)

ఈ లక్షణాలు కలిగిన మరో జీవి గాని, మరొక ఉనికి గాని లేదు.

తరువాత, ఇస్లాం పునరుద్ధరణకు మరియు జమాత్-ఎ-అహ్మదీయ్యా స్థాపనకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా పేర్కొన్నారు: "ఓ జ్ఞానులారా! ఈ అవసర సమయంలో మరియు ఈ గాఢమైన చీకటి రోజులలో, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఒక దివ్య జ్యోతిని అవతరింపజేసి, విశ్వ శ్రేయస్సు కొరకు ఒక సేవకుడిని నియమించి, ఇస్లాం సందేశం యొక్క ఆధిక్యతను ప్రదర్శించడానికి, మానవులలో ఉత్తముడైన (దైవ ప్రవక్త (స)) వారి జ్యోతిని ప్రసరింపజేయడానికి, ముస్లింలకు సహాయపడటానికి మరియు వారి అంతర్గత స్థితిని శుద్ధి చేయడానికి అతడిని ప్రపంచంలోకి పంపినందుకు ఆశ్చర్యపడకండి. దానికి బదులుగా, ఇస్లాం విశ్వాసానికి సంరక్షకుడై, ఖురాన్ బోధనలకు తాను శాశ్వతంగా సంరక్షకుడిగా ఉంటానని మరియు దానిని ఎన్నడూ చల్లబడకుండా, నిర్జీవంగా లేదా జ్యోతిరహితంగా మారనీయనని వాగ్దానం చేసిన ఆ అల్లాహ్, ఈ చీకటిని చూసి, అంతర్గత మరియు బాహ్య కీడును చూస్తూ మౌనంగా ఉండి, ఆయన పవిత్ర వాక్యంలో! తాను అంత గట్టిగా ధృవీకరించిన తన వాగ్దానాన్ని మరచిపోయి ఉంటే ఆశ్చర్యం కలిగి ఉండేది." "

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పంపిన ఈ అనుగ్రహం ఆయన వాగ్దానానికి అనుగుణంగానే ఉంది, ఇందులో ఆశ్చర్యపడాల్సిన విషయం ఏమీ లేదు. ఒకవేళ సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన వాగ్దానాన్ని నెరవేర్చకుండా, ఇస్లాం పతనం కొనసాగి ఉంటేనే ఆశ్చర్యం కలిగేది.

మరల ఇలా పేర్కొన్నారు: "నేను మళ్ళీ చెబుతున్నాను, ఒకవేళ ఆశ్చర్య పోవడానికి ఏదైనా కారణం ఉంటే, అది ఆ దైవ ప్రవక్త (స) యొక్క స్పష్టమైన మరియు నిర్దిష్టమైన ప్రవచనం నెరవేరకపోవడమే. ఆ ప్రవచనంలో, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రతి శతాబ్దం ప్రారంభంలో తన మతాన్ని పునరుద్ధరించే అటువంటి ఉన్నతమైన స్థాయి గల ఒక సేవకుడిని నియమిస్తూనే ఉంటాడని చెప్పబడింది. కాబట్టి ఇది ఆశ్చర్యపోవాల్సిన విషయం కాదు. దానికి బదులుగా, ఇది వేల వేల కృతజ్ఞతలు తెలియజేయాల్సిన సందర్భం, మరియు ఇది ఒకరి విశ్వాసాన్ని, దృఢ విశ్వాసాన్ని బలపరుచుకోవాల్సిన సమయం." అందువల్ల, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) రాక వరకు, ప్రతి శతాబ్దం ప్రారంభంలో వివిధ ప్రజల మధ్య ముజద్దిద్‌లు ఉద్భవించారు. ఆ తర్వాత సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వీరి(అ)ని 14వ శతాబ్దానికి ముజద్దిద్‌గా పంపి, వీరికి మసీహ్ మౌవూద్, మహ్దియే మౌవూద్ అనే స్థాయిని ప్రసాదించాడు. మరల ఇలా తెలిపారు: "ఇది వేల వేల కృతజ్ఞతలు తెలియజేయవలసిన సందర్భం,

మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన అనుగ్రహం మరియు కరుణ ద్వారా తన వాగ్దానాన్ని నెరవేర్చాడని, తన ప్రవక్త ప్రవచనంలో ఒక్క నిమిషం కూడా ఆలస్యం జరగనివ్వలేదని మన విశ్వాసాన్ని, నమ్మకాన్ని బలపరుచుకోవలసిన సమయం ఇది. ఆయన ఈ ప్రవచనాన్ని నెరవేర్చడమే కాకుండా, భవిష్యత్తులో వేలాది ప్రవచనాలకు మరియు అద్భుతాలకు కూడా మార్గం సుగమం చేశాడు."

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) రాకతో, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అనేక ఇతర ప్రవచనాలను కూడా నెరవేర్చారు. మరల ఇలా పేర్కొన్నారు:

"మీకు విశ్వాసం ఉంటే, కృతజ్ఞతతో ఉండండి మరియు కృతజ్ఞతా సజ్దాలు చేయండి, ఎందుకంటే ఏ యుగం కోసమైతే మీ మహనీయ పూర్వీకులు ఆత్రుతతో ఎదురుచూసి గతించిపోయారో, మరియు ఏ తపనతోనే లెక్కలేనన్ని ఆత్మలు ఈ లోకాన్ని విడిచిపెట్టాయో, అటువంటి యుగంలోకి మీరు ప్రవేశించే భాగ్యం పొందారు." పూర్వకాలపు ముస్లిం పండితులు మరియు పుణ్యాత్ములు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారిరాక కోసం ఎదురుచూస్తూ ఉండేవారు. కానీ వారు ఆయన రాకను చూడలేకపోయారు. ఆ యుగాన్ని చూసే భాగ్యం మీకు కలిగిందని, కాబట్టి సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు కృతజ్ఞతతో ఉండాలని హుజూర్ (అ) పేర్కొన్నారు. "ఇప్పుడు దానిని అభినందించాలా వద్దా, అలాగే దాని నుండి ప్రయోజనం పొందాలా వద్దా అనేది మీ చేతిలోనే ఉంది. మానవాళి సంస్కరణ కోసం నిర్ణీత సమయంలో పంపబడిన వాడిని నేనేనని నేను పదే పదే ప్రకటిస్తాను. ఈ ప్రకటన చేయకుండా నేను ఉండలేను (సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నా విషయంలో ఆ వాగ్దానాన్ని నెరవేర్చాడు), తద్వారా హృదయాలలో విశ్వాసం మళ్లీ దృఢంగా నాటబడుతుంది."

(ఇస్లాం విజయం, ఫతహ్ ఇస్లాం, రుహాని ఖజాయిన్ సంపుటి3, పుటలు 6-8)

వారి(అ)ని వ్యతిరేకించేవారు, వారిని (అ)ని అంగీకరించని ముస్లింలు ఈ విషయాన్ని గ్రహించి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయన పంపిన వానిని అంగీకరించి, ఐక్యతా బంధంతో ఏకమైతే ఎంత బాగుంటుందో! తద్వారా నేడు ముస్లింలు ఎదుర్కొంటున్న కష్టాల నుండి వారు రక్షించబడగలరు.

సత్యాన్వేషిని ఉద్దేశించి, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా పేర్కొన్నారు: "దేవునికి కృతజ్ఞతలు తెలపండి, ఎందుకంటే ఆయన సరిగ్గా అవసరమైన సమయంలో మనకు సహాయం చేయడానికి వచ్చి, ఈ వ్యవస్థను స్థాపించాడు. కాబట్టి, మీకు లభించిన ఈ అనుగ్రహాన్ని వృథా చేసుకోకండి. దీనిని గౌరవంతో చూడండి. మీకు అందించబడిన ఈ సహాయాన్ని మరియు అండను విలువైనదిగా భావించండి." ఒక విషయాన్ని సరైన రీతిలో, పూర్తి శక్తితో వివరించాలంటే, అల్లాహ్ మద్దతు లేనిదే, ఆయన మాట్లాడే సామర్థ్యాన్ని ప్రసాదించనిదే, ఎవరూ అలా చేయలేరని బాగా గుర్తుంచుకోండి. ఇది లేకపోతే, ఒక వ్యక్తి సరైన వాదనలను కనుగొనలేడు మరియు సమర్థవంతంగా మాట్లాడలేడు. (అల్లాహ్ సహాయం ఉన్నప్పుడే సరైన వాదనలు లభిస్తాయి.) దేవుని ప్రత్యేక అనుగ్రహం వల్లనే, ఇటువంటి వివరణా శైలి ద్వారా, అంతరాత్మలో మంచితనం కలిగిన వ్యక్తులు, దైవ శక్తితో, పవిత్రాత్మతో నిండి మాట్లాడే వ్యక్తిని గుర్తించగలరు. (అల్లాహ్ పంపిన వ్యక్తిని ప్రజలు గుర్తించగలగడం అల్లాహ్ ప్రసాదించిన ఒక గొప్ప అనుగ్రహం.) కాబట్టి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మీకు ఈ సామర్థ్యాన్ని ప్రసాదించి, సత్యాన్ని గుర్తించగల కళ్లను ఇచ్చాడంటే, అది ఆయన మీపై చూపిన ఒక అద్భుతమైన అనుగ్రహం. సత్యాన్వేషిని ఉద్దేశించి వారు(అ) ఇలా అన్నారు: "మీరు సత్యాన్ని వెతుకుతున్నారు, కాబట్టి అల్లాహ్ మీకు ఈ అవగాహనను ప్రసాదించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేయండి." తమను తాము గొప్ప పండితులుగా భావించుకునే వారు చాలామంది ఉన్నారు, కానీ వారికి అసలైన అవగాహన ఉండదు. వారు మరింతగా వ్యతిరేకతను పెంచుకుంటూ పోతుంటారు. కానీ, అల్లాహ్ మీకు అవగాహనను ప్రసాదించినందుకు మీరు కృతజ్ఞులై ఉండాలి. ఇవి అల్లాహ్ ప్రసాదించిన ఎంతో గొప్ప అనుగ్రహాలు. మరల ఇలా పేర్కొన్నారు: ఒకవేళ అల్లాహ్ మిమ్మల్ని ఈ విధంగా అనుగ్రహించకపోయి ఉంటే, ఇతరుల మాదిరిగానే మీరు కూడా అజ్ఞానపు తెరలలో మునిగిపోయి, దూషణలకు పాల్పడేవారు. (అంటే, సత్యాన్ని స్వీకరించిన వారు నిజంగా అదృష్టవంతులు.) ఇది దేవుని అపారమైన అనుగ్రహం, అది మిమ్మల్ని ఇక్కడికి తీసుకువచ్చింది. ఆ తర్వాత వారు (అ) ఒక ఉదాహరణ ఇస్తూ ఇలా అన్నారు: "ఉదాహరణకు, మియాఁ అబ్దుల్ హక్ వైపు చూడండి. దేవుని అనుగ్రహం అతనికి తోడుగా లేకపోతే, అతను తన విలాసవంతమైన జీవితాన్ని ఎలా వదిలి రాగలడు?" ఇక్కడ పేర్కొన్న మియాఁ అబ్దుల్ హక్ అనగా, కసూర్ పట్టణానికి చెందిన మున్షీ అబ్దుల్ హక్. ఆ సమయంలో ఆయన బి.ఏ. చదువుకుంటున్న విద్యార్థి. ఆయన ముస్లిం కుటుంబంలో పుట్టినప్పటికీ, ఈ మాటలు చెప్పడానికి మూడు సంవత్సరాల ముందే క్రైస్తవ మతంలోకి మారారు. అల్ హకమ్ మరియు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి కొన్ని రచనలను చదివిన తరువాత, అతను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)కు ఒక లేఖ రాశాడు. అందులో, ఇస్లాం యొక్క సత్యం మరియు యథార్థత ఆచరణాత్మక రూపంలో వ్యక్తమవ్వడం చూడాలని తాను కోరుకుంటున్నట్లు పేర్కొన్నాడు. ఇస్లాంలో అటువంటిది ఏదీ తనకు కనిపించలేదని, అందువల్ల దానిని ఆచరణలో ప్రదర్శించడం చూడాలని కోరుకుంటున్నానని అతను చెప్పాడు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అతనికి తిరిగి లేఖ రాస్తూ, కనీసం రెండు నెలల పాటు ఖాదియాన్‌కు వచ్చి ఉండమని ఆదేశించారు. దాని ప్రకారం, అతను దారుల్ అమాన్‌కు బయలుదేరి 1901లో అక్కడికి చేరుకున్నాడు. ఆ తర్వాత, ముఖ్యంగా పలువురు సలహాదారులు అతని చుట్టూ చేరినప్పుడు, అతను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) సాంగత్యంలోనే ఉన్నాడు. అతను అక్కడికి చేరుకున్న సమయంలో, ఖాదియాన్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నప్పుడు, చాలా మంది అతనికి వెళ్లవద్దని సలహా ఇచ్చారు. వారు అతన్ని వెళ్లకుండా ఆపడానికి కూడా ప్రయత్నించారు. వారిలో ఒకరు ఏకంగా అతన్ని దూషించారు. వాస్తవానికి, అతని మతంలో దూషణలు చేయడం నిషిద్ధం మరియు అది సాధారణంగా నాగరికతకు, మంచి నడవడికి విరుద్ధం. అయినప్పటికీ, ఈ విషయాలన్నిటినీ అధిగమించి, దైవ కృప ప్రబలి అతడిని అక్కడికి ఆకర్షించింది. అతనికి చెడు చేసే మార్గాలు ఏమాత్రం అందుబాటులోకి రాలేదు. ఒకవేళ ఆ సమయంలో అతనికి వివాహమై ఉంటే, అతని వివాహం కారణంగా ఇబ్బందులు తలెత్తి ఉండేవని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అన్నారు. ఒకవేళ అతను వివాహం చేసుకుని ఉంటే, అతను ఒక పరీక్షను ఎదుర్కొని ఉండేవాడు. కానీ దేవుడు అతడిని అన్ని విధాలా రక్షించాడు. దైవ కృప అనేది కొత్తదానిగా అకస్మాత్తుగా ఉనికిలోకి రాదు (అంటే, అది అల్లాహ్ యొక్క కృప, ఆయన తాను అనుగ్రహించిన వారిపై కురిపిస్తాడు. అది కొత్తదేమీ కాదు). దానికి బదులుగా, అల్లాహ్ ఒకరిపై తన కృపను కురిపించినప్పుడు, ఆయన ఆ వ్యక్తిని అన్ని విధాలా రక్షిస్తాడు. కేవలం మనం ముస్లింలమైనంత మాత్రాన అంతా సర్దుకుపోయిందని అనుకోవద్దు. ఇస్లాం ఒక గొప్ప వరం. దానిని విలువైనదిగా భావించండి మరియు దానికి కృతజ్ఞతలు తెలపండి. కేవలం మాటలు పలకడం ద్వారా పొందలేని ఒక తత్వశాస్త్రం దానిలో ఉంది. (మల్ఫూజాత్, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) సంపుటి 2, పుటలు 435-436 ఎడిషన్ 2022) (మల్ఫూజాత్, సంపుటి 2, పుటలు 515-516) (ఉర్దూ లుఘాత్, సంపుటి 17, పుట 986) కేవలం తమను తాము "ముస్లిం" అని పిలుచుకోవడం మాత్రమే సరిపోదు. ఇస్లాం ఆశించే బోధనలను, ఆచరణలను మరియు సూత్రాలను కూడా పాటించాల్సి ఉంటుంది.

జమాతే అహ్మదియా పట్ల నిజాయితీ, ప్రేమ కలిగిన వారి పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా పేర్కొన్నారు:

"ఈ సందర్భంలో, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అనుగ్రహం మరియు దయ నన్ను ఒంటరిని చేయలేదనే విషయాన్ని ప్రస్తావించకుండా, అందుకు కృతజ్ఞతలు తెలపకుండా నేను ముందుకు సాగలేను. ఎవరైతే నాతో సోదరభావ బంధాన్ని ఏర్పరచుకుని, సర్వశక్తిమంతుడైన అల్లాహఁ స్వయంగా తన చేతులతో స్థాపించిన ఈ జమాఅత్‌లో చేరుతారో, వారు ప్రేమ మరియు విశ్వసనీయత అనే రంగులతో అద్భుతమైన రీతిలో అలంకరించబడతారు. ఇది నా ప్రయత్నం వల్ల జరిగింది కాదు, అల్లాహ్ ప్రత్యేక అనుగ్రహం వల్లనే ఆయన నాకు నిజాయితీతో నిండిన ఇటువంటి ఆత్మలను ప్రసాదించారు." (అహ్మదియత్‌లో చేరిన నిజాయితీపరులను ఉద్దేశించి వారు (అ) ఇలా అంటున్నారు.అంటే, నిజాయితీతో నిండిన ఆత్మలు వారి వద్దకు వచ్చాయని అర్థం). ముందుగా, నా హృదయంలో ఒక ఆధ్యాత్మిక సోదరుని గురించి ప్రస్తావించాలనే తీవ్రమైన కోరిక కలుగుతోంది. ఆయన పేరు, ఆయనకున్న చిత్తశుద్ధి అనే 'నూర్' (కాంతి) లాగే 'నూరొద్దీన్' (అంటే 'ధర్మం యొక్క కాంతి'). ఇస్లాం సందేశాన్ని వ్యాప్తి చేయడానికి, ఆయన తన ధర్మబద్ధమైన సంపాదనను ఖర్చు చేస్తూ చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను నేను ఎంతో ఆత్రుతతో, ఆసక్తితో గమనిస్తుంటాను. అయ్యో! అటువంటి సేవలను నేను కూడా చేయగలిగితే ఎంత బాగుండును!" తాను స్వయంగా ఇస్లాం మార్గం కోసం ఎంతో కృషి చేస్తున్నప్పటికీ, హజ్రత్ మౌల్వీ నూరొద్దీన్ (రజి) చేస్తున్న త్యాగాలను చూసినప్పుడు, తాను కూడా అటువంటి ఆర్థిక సేవలు చేయగలగాలని వారిలో ఒక గాఢమైన కోరిక కలిగింది. "ధర్మ సేవ చేయాలనే తపన వారి హృదయంలో ఉప్పొంగుతుండటం చూస్తుంటే, అల్లాహ్ తన సేవకులను తన వైపు ఎలా ఆకర్షించుకుంటాడో తెలిపే దైవిక శక్తి యొక్క దృశ్యం నా కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. వారు (రజి) తన సంపద మొత్తంతో, తన సర్వశక్తితో మరియు తనకున్న వనరులన్నింటితో దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయత చూపడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు." (ఇక్కడ, హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్ (రజి) గురించి మాట్లాడుతున్నారు. "అంతేకాదు, కేవలం ఇతరుల గురించి మంచి అభిప్రాయం కలిగి ఉండటం మాత్రమే కాకుండా, నా వ్యక్తిగత అనుభవం ద్వారా నేను ఒక వాస్తవంగా నమ్మే విషయం ఏమిటంటే, వారు (రజి) తన ధనాన్ని త్యాగం చేయడమే కాకుండా, నా మార్గం కోసం తన ప్రాణాలను, తన గౌరవాన్ని కూడా త్యాగం చేయడానికి ఏమాత్రం వెనుకాడరు. నేను అనుమతించి ఉంటే, వారు (రజి) ఈ మార్గంలో తన సర్వస్వాన్ని త్యాగం చేసి ఉండేవారు. తద్వారా, ఆధ్యాత్మిక సాంగత్యంతో పాటు, భౌతిక సాంగత్యాన్ని కూడా నెరవేర్చుకుంటూ, ఎల్లప్పుడూ నా తోడులోనే ఉండేవారు." (ఫతహ్ ఇస్లాం, రుహాని ఖజాయిన్, సంపుటి 3, పేజి 35) వారు (రజి) శాశ్వతంగా నాతోటి ఉండిపోయేవారు. ఈ మాటలు 1890వ దశకం చివరలో, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) రచించిన 'ఫతహ్ ఇస్లాం' అనే పుస్తకంలో వ్రాయబడ్డాయి. ఆ తర్వాత, హజ్రత్ మౌల్వీ హకీమ్ నూరొద్దీన్ (రజి) తన సర్వస్వాన్ని వదిలిపెట్టి, 'హజ్రత్ మసీహ్ మౌవూద్

(అలైహిస్సలాం) గారి సేవలోకి వచ్చి, వారితోనే ఉండిపోయారు.

అల్లాహ్ తాలా యొక్క కరుణా ప్రదమైన సుగుణాల ఆధారముగా శారీరక, ఆధ్యాత్మిక ఉపకారాలను ప్రస్తావించుతూ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా పేర్కొన్నారు: "అనంతమైన స్తోత్రాలకు మరియు ఆరాధనలకు అర్హుడు ఆ సర్వశక్తిమంతుడైన అల్లాహ్. ఆయన తన ఆజ్ఞ మరియు శాసనం ద్వారా, ఎటువంటి పూర్వస్థితిలో ఉన్న పదార్థం లేదా సారం లేకుండా (ఏ పదార్థం లేదా ఆదిమ సారం లేకుండా) సమస్త ఆత్మలను మరియు శరీరాలను సృష్టించి తన గొప్ప శక్తిని ప్రదర్శించాడు. మరియు ఏ గురువు లేదా మార్గదర్శకుని ప్రమేయం లేకుండానే సకల పవిత్రమైప ప్రవక్తలకు జ్ఞానాన్ని ప్రసాదించి, వారి నైతికతను పరిపూర్ణం చేయడం ద్వారా తన శాశ్వత కృప యొక్క చిహ్నాన్ని వ్యక్తపరిచాడు." అంటే, అల్లాహ్ పంపే ప్రవక్తలు కూడా ఆయన చేతనే బోధించబడతారు, ఆయన చేతనే శిక్షణ పొందుతారు మరియు ఆయన ఆజ్ఞలను స్వీకరిస్తారు. మరల ఇలా పేర్కొన్నారు: "అల్లాహ్ పవిత్రుడు, అత్యంత దయగలవాడు మరియు కరుణామయుడు. మా సొంత యోగ్యత ఏమీ లేకపోయినా, దీనులమైన మా మానవులకు అవసరమైనవన్నీ (మేము దానికి అర్హులం కాకపోయినా) ఆయనే ప్రసాదించాడు. మన భౌతిక పోషణ కోసం, ఆయన సూర్యుడిని, చంద్రుడిని, మేఘాలను మరియు గాలులను ఏర్పాటు చేశాడు. మరియు మన ఆధ్యాత్మిక అవసరాలను తీర్చడానికి, ఆయన తౌరాత్, ఇంజీన్, ఖురాన్ మరియు ఇతర దివ్య గ్రంథాలన్నింటినీ వాటి తగిన సమయాలలో అవతరింపజేశాడు." మరల వారు (అ) ఇలా ప్రార్థించారు: "ఓ అల్లాహ్! నిన్ను చేరే మార్గానికి మమ్మల్ని నడిపించినందుకు, మరియు నీ పవిత్ర గ్రంథాలను అవతరింపజేయడం ద్వారా ఆలోచన మరియు తర్కం యొక్క దోషాల నుండి మమ్మల్ని రక్షించినందుకు నీకు లెక్కలేనన్ని కృతజ్ఞతలు. ప్రవక్తల అధిపతి, హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా (స) ఎన్నుకోబడిన వారు, వారి సంతతి మరియు వారి సహచరులపై మేము దురూద్ మరియు సలాంలను కోరుతున్నాము. వారి(స) ద్వారా, అల్లాహ్ దారి తప్పిన యావత్ ప్రపంచాన్ని సరైన మార్గంలోకి నడిపించాడు. వారు (స) తప్పుదారి పట్టిన ప్రజలను తిరిగి సరైన మార్గంలోకి నడిపించిన గురువు మరియు ఉపకారి; ప్రజలను షిర్క్ (బహుదేవతారాధన) మరియు విగ్రహాల శాపం నుండి విడిపించిన దయగల మరియు కరుణామయుడు. తౌహీద్ (అల్లాహ్ ఏకత్వం) యొక్క కాంతితో ప్రపంచాన్ని ప్రకాశింపజేసిన కాంతి మరియు కాంతి ప్రకారముడు. రోగగ్రస్త హృదయాలను సన్మార్గంలో నడిచేలా చేసిన స్వస్థపరిచేవాడు మరియు వైద్యుడు. అమృతంతో మృతులను (అంటే, ఆధ్యాత్మికంగా మరణించిన వారిని) పునరుజ్జీవింపజేసిన గొప్ప అద్భుతాలు చేసేవాడు. తన సమాజం కోసం నొప్పి మరియు దుఃఖాన్ని అనుభవించిన కరుణామయుడు మరియు దయామయుడు (వారి (స) సమాజం క్షీణదశలో ఉంది, మరియు దాని కోసమే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఈ యుగంలో పంపబడ్డారు, మరియు వారు దాని కోసం గొప్ప వేదనను భరించారు); మృత్యు కోరల నుండి మనల్ని రక్షించిన శౌర్యవంతుడు మరియు ధైర్యవంతుడు (అల్లాహ్ మొదట ప్రపంచ సంస్కరణ కోసం దైవ ప్రవక్త (స)ను పంపాడు, ఆపై తన సత్య సేవకుడిని పంపాడు. ఆయన దైవ ప్రవక్త (స) గురించి ఇలా పేర్కొన్నారు:) మృత్యు కోరల నుండి మనల్ని రక్షించిన శౌర్యవంతుడు మరియు ధైర్యవంతుడు. తన ప్రభువు ముందు సంపూర్ణ విధేయతతో తలవంచి, తన అహాన్ని పూర్తిగా నాశనం చేసుకున్న వినయశీలి మరియు నిస్వార్థపరుడు. దేవుని ఏకత్వాన్ని సంపూర్ణంగా విశ్వసించేవాడు మరియు జ్ఞాన సముద్రం వంటివాడు, దేవుని వైభవానికి తప్ప మరేదానికీ భయపడనివాడు మరియు ఆయనను మినహా మిగతావన్నీ విలువలేనివిగా భావించినవాడు. దైవిక శక్తి యొక్క అద్భుతం, నిరక్ష రాస్యుడైనప్పటికీ, దైవిక జ్ఞానం విషయంలో అందరినీ మించిపోయి, అన్ని జాతులు బాధపడటానికి కారణమైన దోషాలను మరియు తప్పులను వారికి స్పష్టంగా తెలియ జేశాడు. **(బరాహిన్-ఎ-అహ్మదియ్యా భాగం 1, రుహాని ఖజాయిన్ సంపుటి 1,పేజీలు 16-17) (ఉర్దూ లుఘాత్, సంపుటి 22, పేజీలు 498-499)**

ఇది దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి గురించిన ప్రశంస. ముందుగా వారు (అ) ఏ జాతులైతే ఆయా గ్రంథాల ద్వారా మార్గనిర్దేశం పొందాయో వారికి తౌరాత్ మరియు ఇంజీన్‌ల నుండి ఉదాహరణలను ఇచ్చారు. కానీ ఆ తర్వాత ప్రపంచమంతటా అవినీతి వ్యాపించినప్పుడు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను పంపాడు. వారు (స) ప్రజలను వారి సృష్టికర్తతో కలిపారు.

మరల హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు:"ఓ సర్వలోకాల ప్రభూ! నీవు అనుగ్రహించిన వాటన్నిటికీ నీకు కృతజ్ఞతలు చెప్పడం నా శక్తికి మించినది. నీవు అత్యంత దయామయుడవు మరియు కరుణామయుడవు, మరియు నీవు నాకు ప్రసాదించిన అనుగ్రహాలు అసంఖ్యాకమైనవి. నేను నాశన మవకుండా నా పాపాలను క్షమించు. నీ పట్ల నిష్కపటమైన ప్రేమతో నా హృదయాన్ని నింపు, తద్వారా నేను జీవాన్ని పొందగలను. నా దోషాలను కప్పివేసి, నీకు ప్రీతికరమైన కార్యాలు చేసే భాగ్యాన్ని నాకు ప్రసాదించు. నీ శిక్ష నాకు తగలకుండా నీ మహోన్నత ముఖనాదంలో శరణు కోరుతున్నాను. కరుణించి, ఈ లోక మరియు పరలోక కష్టాల నుండి నన్ను రక్షించు. ఎందుకంటే సమస్త అనుగ్రహం మరియు కరుణ నీ చేతిలోనే ఉన్నాయి. ఆమీన్, సుమ్మ ఆమీన్."

(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 217, ఎడిషన్ 2022)

మరల హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా వ్రాశారు:

"మరే ఇతర యుగంలో గానీ, మరే ఇతర కాలంలో గానీ ఎన్నడూ చూడని విధంగా, దేవుడిని తెలుసుకోవడానికి మరియు ఆయనకు భయపడటానికి అద్భుతమైన మార్గాన్ని అందించే మతాన్ని మాకు ప్రసాదించిన ఆ దయామయుడైన అల్లాహ్‌కు వేయి రెట్లు కృతజ్ఞతలు. మరియు, ఏ ప్రవక్త ద్వారా మనము ఈ పవిత్ర మతంలోకి ప్రవేశించామో, ఆ పాపరహితుడైన ప్రవక్తపై వేల వేల ఆశీస్సులు కురియుగాకా!. మరియు, తమ రక్తంతో ఈ ఉద్యానవనానికి నీరు పోసిన ఆ దైవ ప్రవక్త (స) సహచరులపై వేల వేల కరుణలు కురియుగాకా!."

(బరాహీన్-ఎ-అహ్మదియ్యా భాగం 5 రుహాని ఖజాయిన్ సంపుటి 21, పేజి 25)

ఒక సందర్భంలో, హుజూర్ (అ) ఇలా తెలిపారు:

"దైవ దృష్టిలో సత్యవంతులు మరియు నీతిమంతులు అయిన వారు, అజ్ఞానుల చేతుల ద్వారా మరియు వారి మాటల (నాలుకల) ద్వారా ఎల్లప్పుడూ కష్టాలను అనుభవిస్తూనే వచ్చారు." సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దృష్టిలో నీతి మంతులు మరియు సత్యవంతులుగా ఉండి, తమ విశ్వాసానికి నిజాయితీగా కట్టుబడి, అల్లాహ్‌కు విశ్వసనీయులుగా ఉండేవారు, అజ్ఞానుల చేతుల ద్వారా మరియు వారి మాటల ద్వారా వేదనకు గురవుతుంటారు. నేటి కాలంలో వివిధ ప్రాంతాల్లో అహ్మదీలు కూడా అటువంటి కష్టాలనే ఎదుర్కొంటున్నారు. "ఆదికాలం నుండి అల్లాహ్ అనుసరిస్తున్న శాశ్వత సంప్రదాయం ఇదే కాబట్టి, మనకు కూడా మన సొంత వారి నుండి గానీ లేదా అపరిచితుల నుండి గానీ ఏదైనా కష్టం ఎదురైతే, మనం కృతజ్ఞతలు తెలపాలి మరియు సంతోషించాలి. ఎందుకంటే, ఆ నిజమైన ప్రియుని (అల్లాహ్) మార్గంలో కష్టాలను అనుభవించే స్థాయికి మనం అర్హులమని నిరూపితమైంది." మనం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మార్గంలో కష్టాలను ఎదుర్కొంటు న్నామంటే, అది మన అదృష్టమే. కాబట్టి మనం సంతోషించాలి మరియు అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఎందుకంటే, అల్లాహ్ ఎవరిని ప్రేమిస్తాడో, వారిని మాత్రమే తన మార్గంలో కష్టాలను భరించేలా మరియు హింసకు గురయ్యేలా చేస్తాడు. కావున, ఈ విధంగా కష్టాలను భరించడం నిజానికి మనకు గౌరవప్రదమైన విషయమే. అయితే, మరో కోణంలో చూస్తే, విశ్వాసానికి శత్రువులైన కొందరు వ్యక్తులు, తమ కల్పిత కథనాల ద్వారా కేవలం మనకు బాధ కలిగించడమే కాకుండా, ఏమీ తెలియని అమాయక ప్రజలను కూడా గందరగోళంలోకి నెట్టేస్తున్నారు. అటువంటి పరిస్థితుల్లో, ఆ అమాయక ప్రజలను ఆ గందరగోళం నుండి కాపాడటం మన బాధ్యత అని మేము భావిస్తాము." **(మజ్మూఆ-ఏ-ఇష్తిహారాత్, సంపుటి 1, పుటలు 141-142)** అంటే, మనం వారికి వాస్తవాలను వివరించాలి మరియు ప్రజలకు హాని కలిగించేందుకు ఈ శత్రువులు చేసే దుశ్చర్యలను బయటపెట్టాలి. ప్రజలను గందరగోళం నుండి కాపాడటం అంటే, మన ప్రత్యర్థులు ఉపయోగించే అసభ్యకరమైన భాషను మనం కూడా వాడటం లేదా అదుపులేని ప్రవర్తనకు దిగజారడం అని అర్థం కాదు. నిజానికి, ఇస్లామీయ బోధనల పరిధిలోనే ఉంటూ, వారి అబద్ధపు ప్రచారాలకు మరియు నిరాధారమైన ఆరోపణలకు మనం సమాధానం చెప్పాలి. మన ప్రచారకులందరూ కూడా ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. విమర్శకుల అభ్యంతరాలకు సమాధానమిచ్చే క్రమంలో, కొన్నిసార్లు మనం కూడా అటువంటి మాటలు అంటుంటాము, అవి విమర్శకులకు మన నైతిక ప్రమాణాలనే ప్రశ్నించే అవకాశం కల్పిస్తాయి. మన నైతికత అత్యున్నత స్థాయిలో ఉండాలి. మనం నిశ్చయంగా సత్యాన్ని పలకాలి, కానీ అది ఉత్తమ నైతిక ప్రవర్తన యొక్క పరిధిలోనే ఉండాలి. వారు ఉపయోగించే భాషను మనం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుకరించకూడదు.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా పేర్కొన్నారు: "అల్లాహ్, అత్యున్నతుడైన దేవుడు నాకు ప్రసాదించిన అపారమైన అనుగ్రహాలకు కృతజ్ఞతలు తెలపడానికి నా మాటలు చాలవు." ఉలేమా నాపై అవిశ్వాసం మోపుతున్న ఈ సమయంలో, మరియు నలు వైపుల నుండి **లస్త మోమినన్** అనే స్వరం ను నేను వినేవాడిని. కాని " వైభవోపేతుడైన అల్లాహ్ నుండి నాకు ఈ పిలుపు వినిపిస్తూ ఉండేది. **ఖుల్ ఇన్ని ఉమిర్తు వ అనా అవ్వలుల్ మోమినీన్** అనగా " ప్రకటించుము. నేను అవతరించబడ్డాను మరియు నేను విశ్వాసులలో అగ్రగణ్యుడిని."'"ఒకవైపు, ఈ మతపెద్దలు, 'ఈ వ్యక్తిని ఎలాగైనా నిర్మూలించండి' అని చెబుతుంటే, మరోవైపు, ఈ వెల్లడి వస్తుంది: **యతరబ్బసూ అలైక ద్దవాఇర అలైహిం దాఇరతు స్సుఅ** అనగా "వారు మీరు దురదృష్టానికి గురవుతారని ఎదురు చూస్తున్నారు. చెడు బాధ వారిపై ఉంటుంది. చివరికి ఇదే జరిగవలసి యున్నది. ఇన్నా అల్లాహ్. మరల "ఒకవైపు వారు నన్ను అవమానపరచడానికి మరియు హేళన చేయడానికి ప్రయత్నిస్తున్నారు మరియు మరొక వైపు దేవుడు ఇలా వాగ్దానం చేస్తున్నాడు. ఇన్ని ముహీనున్ మ్మన్ అరాద ఇహానతక అల్లాహు అజ్‌రుక అల్లాహు యుఉతీక జలాలక అనగా "మిమ్మల్ని అవమానించాలనుకునేవాడిని నేను అవమానిస్తాను. అల్లాహ్ మీ ప్రతిఫలం. అల్లాహ్ నీకు గౌరవం మరియు కీర్తిని ప్రసాదిస్తాడు." ఒకవైపు "తమ పక్షాన, మౌల్వీలు నా విశ్వాసాలను కలిగి ఉన్న మరియు నన్ను అనుసరించే ఎవరైనా అవిశ్వాసులు అవుతారని శాసనం తర్వాత శాసనం జారీ చేస్తున్నారు. మరియు అత్యున్నతు

డైనవాడై అల్లాహ్, ఇలా నొక్కి చెబుతున్నాడు: ఖుల్ ఇన్‌కుతుమ్ తుహిబ్బునల్లాహ ఫత్తబిఊని యుహ్‌బిబ్‌కుముల్లాహు. అనగా "నీవిట్లనుము, ఒకవేళ మీరు అల్లాహ్‌ను ప్రేమిస్తున్నట్లయితే, నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు." (సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ మాటను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో అన్నాడు. ఇప్పుడు, ఆ ప్రవక్తను అనుసరించే క్రమంలో, అల్లాహ్ తన నిజమైన సేవకునితో కూడా ఇదే మాట అంటున్నాడు. ఎందుకంటే ఆ సేవకుడు దైవ ప్రవక్త (స) పట్ల నిజమైన, గాఢమైన ప్రేమ కలిగి యున్నాడు. వారిని అంగీకరించడం అంటే దైవ ప్రవక్త (స)కు పరిపూర్ణ విధేయత చూపడమే, ఎందుకంటే వారు కూడ దైవ ప్రవక్త (స) వారి పరిపూర్ణ మరియు విధేయత గల సేవకుడై ఉన్నాడు.) "క్లుప్తంగా చెప్పాలంటే, ఈ మౌల్వీలందరూ అల్లాహ్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. చూద్దాం, చివరికి ఎవరికి విజయం దక్కుతుందో!"

(నిషానే అస్మానీ, రుహాని ఖజాయిన్, సంపుటి 4, పేజి 422-423)

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అనుగ్రహంతో, ఈ జమాఅత్ క్రమంగా పురోగమిస్తోంది. ఈ జమాఅత్ అభివృద్ధి చెందుతున్న తీరే వీరికి తగిన సమాధానం. ఒకవేళ వారిలో విషయాలను గ్రహించే అంతర్దృష్టి, కనీసం కొంత సిగ్గు అయినా ఉండి ఉంటే బాగుండేది!.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు: "ఈ సందర్భంలో నేను ఈ కృతజ్ఞతలు చెప్పకుండా ఉండలేను: సర్వశక్తిమంతుడైన అల్లాహ్, మన దైవ ప్రవక్త (స.అ.)కు మద్దతుగా తన దివ్యవాణి ద్వారా అవిశ్వాసులను జవాబు దారీగా నిలబెట్టి, నా ప్రవక్త ప్రవర్తన ఎంత ఉన్నతమైన ప్రమాణాలతో ఉందంటే, వారు (స) నలభై సంవత్సరాలు మీ మధ్య పగలు రాత్రి జీవించినప్పటికీ, వారి గత నలభై సంవత్సరాల జీవితంలో ఏ ఒక్క తప్పును గానీ, లోపాన్ని గానీ ఎత్తి చూపడానికి మీకు శక్తి లేదు అని ప్రకటించినట్లే. అంతేకాక, గొప్పతనం, పవిత్రత, సార్వభౌమత్వం మరియు శ్రేష్ఠత కలిగిన వారి ఉన్నత కుటుంబంలో ఒక్క చిన్న లోపాన్ని కూడా కనుగొనడానికి మీకు శక్తి లేదు. అప్పుడు ఆలోచించండి. అంతటి ఉన్నతమైన, అంతటి పవిత్రమైన, అంతటి శ్రేష్ఠమైన కుటుంబానికి చెందిన వ్యక్తి, మీ కళ్లెదుటే గడిపిన తన నలభై సంవత్సరాల జీవితమే కల్పన మరియు అసత్యం వారి (స) మార్గం కాదని సాక్ష్యమిస్తోంది. అటుపై, ఈ శ్రేష్ఠతలతో పాటు, వారి దివ్యమైన సూచనలను కూడా ప్రదర్శిస్తున్నప్పుడు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మద్దతు స్పష్టంగా ప్రవక్తతో ఉన్నప్పుడు, మరియు మీ స్వంత విశ్వాసాలకు వ్యతిరేకమైన ఒక బోధనను వారు తీసుకువచ్చినప్పుడు." అందుకు భిన్నముగా పూర్తిగా అపరిశుభ్రంగా, అపవిత్రంగా, బహుదేవతారాధనలో కూరుకుపోయి మీరు నిలబడిన తర్వాత కూడా, అట్టి ప్రవక్త యొక్క సత్యసంధత గురించి మీ మనస్సులలో ఇంకే సందేహం మిగిలి ఉందా?.

ఇస్లాం విరోధులకు సమాధానమిచ్చే క్రమంలో అంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ తఆలా తరపున వచ్చిన నిజమైన ప్రవక్త అని, వారి ద్వారానే ప్రపంచం అల్లాహ్ తఆలాతో అనుసంధానం అయ్యే మార్గం లభించిందని తెలియజేస్తున్నారు. మరల తమను గూర్చి ఇలా పేర్కొంటున్నారు: "అదేవిధంగా, అల్లాహ్ తఆలా నా విరోధులను మరియు నన్ను తిరస్కరించేవారిని కూడా బాధ్యులను చేశాడు (వారిని శిక్షకు గురిచేశాడు), ఎందుకంటే నేను కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి నిజమైన సేవకుడనే. అల్లాహ్ తఆలా నాకు కూడా అదే వాగ్దానాన్ని ఇచ్చాడు." ఈ సందర్భంలో వారు 'బరాహీనే అహ్మదియ్యా'లోని ఒక అంశాన్ని ఉటంకిస్తూ ఇలా పేర్కొన్నారు. "అందులో నా గురించి ఒక దైవిక సందేశం (వహీ) ఉంది. అది ప్రచురితమై నేటికి ఇరవై సంవత్సరాలు గడిచిపోయాయి. ఆ దైవిక సందేశం ఇది: **వలఖద్ లఖ్‌సిను ఫీకుం ఉమురన్ మిన్ ఖబ్‌లిహీ అఫలా తాఖిలూన్.** అనగా " ఈ విరోధులతో ఇలా చెప్పండి: 'నేను మీ మధ్య నలభై ఏళ్ల సుదీర్ఘ కాలం జీవించాను. ఈ సుదీర్ఘ కాలమంతా మీరు నన్ను గమనిస్తూనే ఉన్నారు. నా పనులలో ఎన్నడూ ఎటువంటి కల్పితం లేదా అసత్యం లేదు. అల్లాహ్ నన్ను అపవిత్రమైన జీవితానికి దూరంగా, సురక్షితంగా ఉంచాడు.' కాబట్టి, నలభై ఏళ్ల సుదీర్ఘ కాలం పాటు ఎటువంటి కల్పితాలు, అల్లర్లు, మోసాలు లేదా దురుద్దేశాలకు దూరంగా ఉండి, దేవుని సృష్టిలో ఎవరికీ ఎన్నడూ ఒక్క అబద్ధం కూడా చెప్పని వ్యక్తి తన జీవితకాలపు అలవాటుకు విరుద్ధంగా ఇప్పుడు అల్లాహ్ తఆలాపై అబద్ధాన్ని ఎలా కల్పించగలడు?" **(తర్యాఖుల్ ఖులూబ్, రూహానీ ఖజాయిన్, సంపుటి 15, పుటలు 282-283)**

నేను వారి (అ) వ్యక్తిత్వానికి సంబంధించిన అనేక అంశాలను ఇప్పటికే వివరించాను. వారి (అ) ప్రత్యర్థులు కూడా వారిని ఎంతగానో ప్రశంసించేవారని, వారు (అ) ఎప్పుడూ అబద్ధం చెప్పలేదని, ఎటువంటి అవాంఛనీయ ప్రవర్తనకూ పాల్పడలేదని వారి మాటల ద్వారా స్పష్టమవుతోంది. ఇవి కృతజ్ఞతా భావానికి నిదర్శనాలు; వీటి ద్వారా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలకు కృతజ్ఞతలు తెలపడమే కాకుండా, తనకు సహాయ సహకారాలు అందించిన వారి పట్ల కూడా కృతజ్ఞతా భావాన్ని వ్యక్తపరిచారు.

ఇవి మాత్రమే కాకుండా, పిల్లలలో కృతజ్ఞతా భావం యొక్క ప్రాముఖ్యతను పెంపొందించడానికి కూడా వారు (అ) కృషి చేశారు. ఈ విషయంలో ఆయన ఇంట్లో ఎలా వ్యవహరించేవారంటే, ఒక కథనం ప్రకారం, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఒకసారి ఇంట్లోని పిల్లలకు ఒక కథ చెప్పారు. దీనిని హజ్రత్ ముస్లేహ్-ఎ-మౌవూద్ (రజియల్లాహు అన్హు) నమోదు చేసి, 'అల్ హకం' పత్రికలో ప్రచురించారు. ఆ కథ ఇలా ఉంది:ఒక వ్యక్తికి జుట్టు లేదు (బట్టతల), మరొక వ్యక్తికి చూపు లేదు (అంధుడు). దేవుని దూత ఒకరు మానవ రూపంలో వచ్చి, బట్టతల ఉన్న వ్యక్తిని, "నీకు ఏమి కావాలి?" అని అడిగారు. అప్పుడు ఆ వ్యక్తి, "నా తలపై జుట్టు మొలవాలి, అలాగే నాకు సంపద, ఐశ్వర్యం లభించాలి" అని కోరుకున్నాడు. అప్పుడు ఆ దూత అతని తలపై చేయి ఉంచగా, దేవుని శక్తితో అతని తలపై జుట్టు మొలిచింది; అంతేకాకుండా అతనికి సంపద, సేవకులు కూడా లభించారు. ఆ తర్వాత, ఆ దూత చూపు లేని వ్యక్తి దగ్గరకు వెళ్లి, "నీకు ఏమి కావాలి?" అని అడిగారు. అప్పుడు ఆ వ్యక్తి, "నాకు కంటి చూపు ప్రసాదించు, తద్వారా నేను రొట్టె ముక్కల కోసం ఎవరినీ అడుక్కోవాల్సిన అవసరం ఉండదు. అలాగే నాకు కొంత ధనం ఇవ్వు, తద్వారా నేను ఎవరిపైనా ఆధారపడకుండా జీవించగలను" అని కోరుకున్నాడు. ఆ దేవదూత అతని కళ్లపై తన చేయి ఉంచగా, అతనికి దృష్టి లభించింది; అంతేకాక, అతనికి అపారమైన సంపద, ఐశ్వర్యాలు కూడా సమకూరాయి. ఆ తర్వాత, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆదేశం మేరకు, అదే దేవదూత ఒక యాచకుని వేషధారణలో వచ్చి, ఆ దృష్టి పొందిన వ్యక్తిని మరియు పూర్వం బట్టతల కలిగి ఉన్న వ్యక్తిని పరీక్షించాలనుకున్నాడు. అతను బట్టతల ఉన్న వ్యక్తి దగ్గరకు వెళ్లి సహాయం కోరగా, ఆ వ్యక్తి కఠినంగా, అసభ్యంగా ప్రవర్తిస్తూ, "వెళ్లిపో ఇక్కడి నుండి! నీలాంటి యాచకులు ఎంతోమంది తిరుగుతుంటారు" అని గద్దించాడు. అప్పుడు ఆ దేవదూత అతని తలపై చేయి ఉంచగా, అతను తిరిగి పూర్వంలాగే బట్టతల కలవాడిగా మారిపోయాడు; అతని సంపద, ఐశ్వర్యాలన్నీ తొలగిపోయాయి మరియు అతను మళ్లీ తన పాత దీనస్థితికి చేరుకున్నాడు. అప్పుడు అదే దేవదూత, ఒక బిచ్చగాడి వేషంలో, చాలా ధనవంతుడై, చూపు తిరిగి పొందిన ఆ అంధుడి వద్దకు వచ్చి తన అభ్యర్థనను తెలియజేశాడు. ఆ అంధుడు, "ఇదంతా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఒక్కడే ఇచ్చాడు; ఇది ఆయన సంపద దీన్ని తీసుకోండి" అని అన్నాడు. దీనికి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆ అంధుడికి మరింత సంపదను, ఐశ్వర్యాన్ని ప్రసాదించాడు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అప్పుడు ఇలా అన్నారు: కాబట్టి, నా ప్రియమైన పిల్లలారా!, మీరు కూడా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మీకు ఇచ్చిన అనుగ్రహాలకు కృతజ్ఞతతో ఉండాలని, వాటిని విలువైనవిగా భావించాలని, మరియు మిమ్మల్ని అడిగిన వారిని ఎన్నడూ నిందించకూడదని గుర్తుంచుకోవాలి. దానం చేయడం మంచిది, మరియు అడిగిన వారికి ఇవ్వాలి; ఇది అల్లాహ్‌ను సంతోషపరుస్తుంది, మరియు ఆయన తన అనుగ్రహాన్ని మరింతగా వృద్ధి చేస్తాడు. **(అల్ హకం, 13 సెప్టెంబర్ 1898, సంపుటి 2, సంచిక 26-27, పుట 11)**

మూడు రకాల ప్రజల ప్రస్తావన ఉన్న ఒక సుదీర్ఘమైన హదీసు నుండి ఇది గ్రహించబడినప్పటికీ, వారు (అ) దానిని పిల్లల కోసం సంక్షిప్తీకరించి, ఇంట్లో ఈ కథ రూపంలో చెప్పేవారు. **(సహీ-బుఖారీ, కితాబ్ అహదీసుల్ అన్బియా'; బాబ్ హదీసు అబ్రాస్ వ అ'మా వ అఖ్రా' ఫీ బనీ ఇస్రాయీల్, హదీసు 3464)**

రమజాన్ మాసం శీతాకాలంలో వచ్చినప్పుడు, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తన కృతజ్ఞతా భావాలను ఒక సున్నితమైన మరియు సూక్ష్మమైన రీతిలో వ్యక్తపరిచారు. అందువల్ల, హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి) ఇలా వ్రాశారు: మౌల్వి షేర్ అలీ సాహిబ్ (రజి) ఒకసారి తనకు ఇలా వివరించారట, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా అన్నారు: "రమజాన్ మాసం

అహ్‌దీస్ బోధనలు

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:
"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."
(కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671)

దుఆ ఆశించువారు: ***Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

అహ్‌దీస్ బోధనలు

"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.
(మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్)

దుఆ ఆశించువారు: ***Muhammad Vazeer Ahmad sb***

శీతాకాలంలో వచ్చే సమయంలో అల్లాహ్ మనల్ని మేల్కొపడం కూడా సర్వశక్తి మంతుడైన అల్లాహ్ యొక్క ఒక అనుగ్రహమే. దానివల్ల ఉపవాసం ఉండటం వలన శారీరకంగా పెద్దగా కష్టం కలగదు, మరియు మనం రమజాన్ మాసంలో కూడా మన పనులను సునాయాసంగా చేసుకోగలుగుతాము." ఆ రోజుల్లో రమజాన్ డిసెంబరులో వచ్చేదని మౌల్వి సాహిబ్ చెప్పేవారు, ఈభవదీయుడు తెల్పునదేమనగా, ఆ కాలపు పంచాంగాన్ని (జంత్రీని) నేను పరిశీలించాను. ఇది నా స్వంత పరిశీలన . బహుశా హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి) ఇలా పేర్కొని ఉండవచ్చు: వారు ఆ కాలపు క్యాలెండర్‌ను పరిశీలించగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) 1891లో మసీహ్ మౌవూద్‌గా తన దావాను ప్రకటించారు. ఆ సంవత్సరంలో రంజాన్ మాసం ఏప్రిల్ 11న ప్రారంభమైంది. ఇది ఒక రకంగా రంజాన్ మాసం శీతాకాలంలోకి ప్రవేశించడం ప్రారంభమైన సమయం. తదనంతరం, 1892లో రంజాన్ మాసం మార్చి 31న, 1893లో మార్చి 20న మొదలైంది. ఆ తర్వాత ప్రతి ఏటా రంజాన్ మాసం మరింతగా శీతాకాలపు రోజులలోకి రాసాగింది. 1908లో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) పరమపదించిన సంవత్సరంలో రంజాన్ మాసం అక్టోబర్ 1న ప్రారంభమైంది. అంటే, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి ప్రవక్తత్వ కాలం మొత్తం రంజాన్ ఉపవాసాలు శీతాకాలంలోనే వచ్చాయి. ఇది అల్లాహ్ తఆలా యొక్క ఒక అనుగ్రహం మరియు ఆయన నిర్ణయాను సారం జరిగిన విషయం. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) దీనిని దైవిక ఆశీర్వాదంగా గుర్తించి, కృతజ్ఞతా భావంతో స్పందించారు.

(సీరతుల్ మహదీ, సంపుటి 1, భాగం 2, కథనం 419, పుటలు 372-373)

మానవాళికి ఎవరి పని ద్వారా అయినా ప్రయోజనం చేకూరుతుంటే, అందుకు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) కృతజ్ఞతలు తెలిపేవారు. మానవ సంక్షేమానికి సంబంధించిన సత్కార్యాల గురించి ప్రస్తావిస్తూ, ఒక సందర్భంలో వారు (అ) హజ్రత్ హకీమ్ మౌలానా నూరుద్దీన్ సాహిబ్ చేస్తున్న వైద్య సేవలను ఉదహరించారు. రోగులకు చికిత్స అందించడం మరియు వారిని స్వస్థపరచడం అనేది ఎంతో ప్రయోజనకరమైన పని. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) దీనిని ఎంతో విలువైనదిగా భావించి, అభినందించేవారు. ఒకసారి, ఇంట్లో హజ్రత్ మౌల్వీ సాహిబ్ (రజి) ప్రస్తావన వచ్చినప్పుడు, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) చాలా సేపటి వరకు, "సర్వ స్తోత్రములు అల్లాహ్‌కే చెందును, సర్వ స్తోత్రములు అల్లాహ్‌కే చెందును" అని చెబుతూనే ఉన్నారు. మరియు హజ్రత్ హకీమ్ మౌల్వీ నూరొద్దీన్ సాహిబ్ స్వయంగా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క అనుగ్రహాలలో ఒకరని, ఎందుకంటే వారి ద్వారా చాలా మంది పేదలకు చికిత్స అందిందని అన్నారు. చికిత్స పొందుతున్నది ఇతరులే అయినప్పటికీ, మానవాళికి ఒక సేవ జరుగుతున్నందుకు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారే కృతజ్ఞతలు తెలుపుచున్నారు, మరియు ఆ మానవులు దాని నుండి ప్రయోజనం పొందుతున్నారనే వాస్తవానికి కూడావారు కృతజ్ఞతలు తెలిపారు. **(జల్సా సలానాలో ప్రసంగం, 27 డిసెంబర్ 1922, అన్వారుల్-ఉలూమ్, సంపుటి 7, పుట 35)**

మానవాళి పట్ల వారి (అ)కున్న కరుణ కూడా ఇదే. ప్రజల బాధలను తొలగించిన వారికి కూడా వారు కృతజ్ఞతలు తెలిపేవారు, మరియు వారి బాధలను తొలగించే మార్గాలను ఏర్పాటు చేసినందుకు సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు కూడా కృతజ్ఞతలు తెలిపేవారు. ఇన్షా-అల్లాహ్, భవిష్యత్తులో ఈ విషయంపై మరిన్ని వివరాలు తెలియజేస్తాను.

ఈ సమయంలో, దివంగతులైన మన సభ్యులలో కొందరి గురించి ప్రస్తావించాలనుకుంటున్నాను, మరియు నమాజ్ అనంతరం వారి జనాజ నమాజ్‌ను కూడ చదివించుతాను.

వీరిలో మొదటి ప్రస్తావన, ఐవరీ కోస్ట్‌లో జమాత్‌లో మిషనరీగా సేవలందిస్తున్న హఫీజ్ షాబాజ్ అహ్మద్ సాహిబ్ గారిది. వారు జూలై 18న, 31 ఏళ్ల వయస్సులో గుండెపోటు కారణంగా మరణించారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అనుగ్రహంతో, వారు ఒక 'ముసీ'. వారికుటుంబంలో భార్య మరియు ఒక కుమార్తె ఉన్నారు.

వారు 2008లో పవిత్ర ఖురాన్‌ను కంఠస్థం చేశారు. 2019లో 'జామియా' నుండి పట్టభద్రులైన తర్వాత, ఆయన (ఎన్‌యుఎమ్ఎల్) విశ్వవిద్యాలయం నుండి ఫ్రెంచ్ భాషలో ఒక ఏడాది డిప్లొమా పొందారు, ఆపై ఫ్రెంచ్ భాషలో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేశారు. అనంతరం వారు ఐవరీ కోస్ట్‌కు నియమితులయ్యారు. వారు ఎంతో సామాజిక దృక్పథం, ఆతిథ్య గుణం మరియు ఉల్లాసభరితమైన స్వభావం కలిగిన వ్యక్తి. ఖిలాఫత్ పట్ల అచంచలమైన అభిమానం కలిగి, జమాత్ సేవకు అంకితమై, తన జీవితాన్ని అల్లాహ్ మార్గంలో అర్పించిన వ్యక్తిగా బాధ్యతలను అత్యుత్తమంగా నిర్వహించారు.

కొంతకాలంగా వారు ఆన్‌లైన్ ద్వారా పవిత్ర ఖురాన్‌ను, సరైన ఉచ్చారణ మరియు పఠన నియమాలతో ఉర్దూ మరియు పర్షియన్ భాషల్లో బోధిస్తూ వచ్చారు. వారి గురించి రాసిన వారు పేర్కొన్నట్లుగా, వారిలో అత్యంత విశిష్టమైన లక్షణాలు ఆత్మగౌరవం మరియు సహనం గలవు. ఆయన ఎవరికీ భారం కాలేదు. ఆయనకు ప్రచార కార్యకలాపాల (తబ్లీగ్) పట్ల ఎంతో ఉత్సాహం ఉండేది, కొన్నిసార్లు తన సొంత ఇంట్లోనే ప్రచార సమావేశాలను కూడా నిర్వహించేవారు. ఆయన స్థానిక ప్రముఖులతో మరియు నగర పరిపాలనా అధికారులతో అద్భుతమైన సంబంధాలను కొనసాగించారు. జమాత్ సభ్యులకు శిక్షణ ఇచ్చేందుకు నిరంతరం కొత్త మార్గాలను అన్వేషించేవారు. ఆఫ్రికన్ ప్రజలతో తన మధ్య ఎటువంటి దూరం ఏర్పడకుండా చూసుకున్నారు. తాను పనిచేసిన ప్రాంతంలో, ఎంతో అంకితభావంతో మరియు కష్టపడి జమాత్ కోసం నిర్మాణ పనులను చేపట్టారు, అనేక మంచి పనులు చేశారు మరియు వివిధ చోట్ల మసీదుల నిర్మాణానికి కృషి చేశారు.

ఆయన భార్య సబీకా సాహిబా ఇలా తెలిపారు: ఆయన ఒక మంచి, భక్తిగల మరియు అత్యంత బాధ్యతాయుతమైన మిషనరీగా, భర్తగా మరియు తండ్రిగా ఉండేవారు. ఆయన తరచుగా, "నేను జమాత్ కోసం గొప్ప సేవలు చేసేలా అల్లాహ్ నాకు అవకాశం కల్పించాలని నా కోసం ప్రార్థించండి" అని కోరేవారు. జమాత్ కోసం ఏదైనా గొప్ప కార్యం చేయాలనే బలమైన ఆకాంక్ష ఆయనలో ఉండేది. జమాత్ నిధులను ఆయన ఎంతో పవిత్రమైనవిగా, గౌరవనీయమైనవిగా భావించే వారు. ఆయన అపారమైన సహనం, ఓర్పు కలిగిన వ్యక్తి. ఎలాంటి కష్టాలు లేదా దుఃఖాలు ఎదురైనా, వాటి ప్రభావం తనపై పడకుండా చూసుకునేవారు. ఆయనలో కోపం అనే ఛాయ కూడా ఉండేది కాదు. ఎల్లప్పుడూ చిరునవ్వుతో, ఉత్సాహంగా ఉండేవారు; ఎంతో మృదువుగా మాట్లాడుతూ, విషయాలను ప్రేమపూర్వకంగా వివరించేవారు.

మిషనరీగా పనిచేస్తున్న నౌమాన్ ఖదీర్ సాహిబ్ ఇలా తెలిపారు: హఫీజ్ సాహిబ్ మంచి విచక్షణ కలిగిన వ్యక్తి. జమాఅత్‌కు సంబంధించిన ఏదైనా విషయంలో ఆయన సలహా కోరినప్పుడు, ఆయన ఎంతో తెలివితేటలతో సూచనలు ఇచ్చేవారు; దీనివల్ల కష్టమనిపించే సమస్యలు కూడా సులభంగా పరిష్కారమయ్యేవి. అల్లాహ్ ఆయనకు చిన్న వయసులోనే గొప్ప సామర్థ్యాన్ని ప్రసాదించాడు.

మిషనరీ అయిన ఎహతిషాం-ఉల్-హక్ సాహిబ్ ఇలా వ్రాసారు: ఇతర మిషనరీలతోనే కాకుండా, స్థానిక మిషనరీలు, పొరుగువారు మరియు జమాత్ సభ్యులతో కూడా ఆయనకు ఎంతో సన్నిహిత సంబంధాలు ఉండేవి. పలు సమావేశాల్లో చాలామంది ఈ విషయాన్ని ప్రస్తావించారు. కష్టకాలంలో ఉన్నవారికి ఆయన ఎవరికీ తెలియకుండానే సహాయం చేసేవారు.

రఫే తబస్సుమ్ సాహిబ్ ఇలా తెలిపారు: దివంగతులు జమాఅత్‌కు సంబంధించిన ప్రతి పనిని తన సొంత బాధ్యతగా భావించేవారని చెప్పారు. ఆయనకు ఏదైనా బాధ్యత అప్పగించినప్పుడు, దానిని కేవలం ఒక విధిగా కాకుండా, ఒక ఆరాధనగా భావించి పూర్తి చేసేవారు. సమయపాలన, ప్రణాళికాబద్ధత, బాధ్యతాయుతమైన ప్రవర్తన మరియు చిత్తశుద్ధి ఆయన వ్యక్తిత్వంలోని ప్రధాన లక్షణాలు. ఆయనలోని మరో విశేషం ఏమిటంటే, జమాత్ సభ్యులకు విద్యాబోధన, శిక్షణ ఇచ్చేందుకు ఎల్లప్పుడూ కొత్త మార్గాల గురించి ఆలోచించేవారు. యువత, పిల్లలు మరియు పెద్దల నైతిక, ఆధ్యాత్మిక శిక్షణ పట్ల ఆయన ఎంతో శ్రద్ధ వహించేవారు.ఒక మిషనరీకి ఉండాల్సిన అత్యంత ముఖ్యమైన లక్షణం ఇదే.

ఆయనలోని మరో గొప్ప లక్షణం ఆయనకున్న అపారమైన చిత్తశుద్ధి. ఆయన నిస్వార్థంగా సేవ చేసేవారు, ఎప్పుడూ తన సేవలను ప్రదర్శించుకోలేదు. ఆయన పేరు ప్రఖ్యాతుల కోసం ఎప్పుడూ ఆశించలేదు; ఎల్లప్పుడు అల్లాహ్ ప్రసన్నతను మాత్రమే కోరుకున్నారు. ఆయన ఎక్కడ నియమితులైనా, నిరంతరం ధర్మ సేవలోనే నిమగ్నమై ఉండేవారు. పిల్లలకు పవిత్ర ఖురాన్‌ను సరైన ఉచ్చారణతో చదవడం నేర్పేవారు, అది కూడా ఎంతో ప్రేమతో చేసేవారు. చాలామంది పిల్లలు ఆయన వద్ద విద్యనభ్యసించారు, వారు ఇప్పటికీ ఆయనను ఎంతో ఆప్యాయతతో గుర్తు చేసుకుంటారు.

తరువాత ప్రస్తావన బుర్కినా ఫాసోకు చెందిన యారింగానా మోమిని సాహిబ్ గారిది. ఆయన తన ప్రాంతంలో మజ్లిస్ అన్సరుల్లాహ్ యొక్క జయీమ్‌గా

వర్తమాన ఖలీఫా వాఖ్యములు

"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు."
(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)

దుఆ ఆశించువారు: ***Darga sb, jamat AhmadiyyaVizag (A.P)***



సేవ చేసేవారు. జూలైలో, ఆయన పొలాల్లో పని చేస్తుండగా, ఉగ్రవాదులు ఆయనపై కాల్పులు జరిపారు, మరియు ఆయన అమరులయ్యారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. ఆయన 1989లో అహ్మదీయత్‌ను స్వీకరించారు. మిషనరీ వుదూద్ సాహిబ్ ఇలా తెలిపారు: ఆ అమరవీరుడు జమాత్ మరియు ఖిలాఫత్ పట్ల ప్రగాఢమైన ప్రేమ కలిగిన అత్యంత నిష్కపటమైన వ్యక్తి. ఆయనకు పవిత్ర ఖురాన్ పట్ల ప్రగాఢమైన ప్రేమ, మసీదు పట్ల బలమైన అనుబంధం, మరియు ఆరాధన, ఖిలాఫత్ పట్ల విధేయత, జమాత్‌కు సేవ చేయడం పట్ల ఒక ప్రత్యేకమైన స్ఫూర్తి ఉండేవి.

అదేవిధంగా, స్థానిక మిషనరీ అయిన అబ్దుల్లా జంగనీ సాహిబ్ ఇలా తెలిపారు: ఆయన చాలా ధైర్యవంతుడు, నిర్భయుడు, నిష్కపటమైనవాడు, ధర్మబద్ధుడు, ఆరాధన పట్ల అంకితభావం కలవాడు, మంచి స్వభావం కలవాడు, స్నేహశీలి, మాటల్లో మితభాషి మరియు ఖిలాఫత్‌ను ప్రేమించి, దానికి విధేయత చూపే ఒక ఉత్తమ కార్యకర్త అని పేర్కొన్నారు. ఆయన తరచుగా అందరికంటే ముందుగా మసీదుకు చేరుకుని, అక్కడ కూర్చుని పవిత్ర ఖురాన్‌ను పఠించేవారు. ఫజర్ సమయంలో తాను ఆయన ఇంటి పక్కగా వెళ్తున్నప్పుడు, లోపలి నుండి ఖురాన్ పఠన శబ్దం వినిపించేదని ఆ స్థానిక మిషనరీ తెలిపారు.

ఆ ప్రాంతపు రీజినల్ ప్రెసిడెంట్ అయిన అబ్దుర్ రెహమాన్ సాహిబ్ ఇలా తెలిపారు: తాను జమాత్ పని కోసం పిలిచినప్పుడల్లా, వయసు పైబడినప్పటికీ, వఖార్-ఎ-అమల్ (సేవా కార్యక్రమం) ఉన్నప్పుడల్లా ఆయన స్వయంగా వచ్చేవారు, తన పిల్లలను కూడా వెంట తీసుకువచ్చేవారు. ఆయన ప్రతి జల్సా మరియు ఇజ్తెమాకు తప్పకుండా హాజరయ్యేవారు. అనారోగ్యంగా ఉన్నప్పుడు కూడా, ఆయన జమాత్ కార్యక్రమాలలో పాల్గొనేవారు.

ఆమీన్ బలోచ్ సాహిబ్ ఇలా తెలిపారు: తాను కూడా ఆ ప్రాంతంలోనే నివసించేవాడిని, ఆయన క్రమం తప్పకుండా చందాలు చెల్లిస్తూ ఉండేవారు. అదేవిధంగా, స్థానిక మిషనరీ అయిన గౌరవనీయ బల్బో సాహిబ్ ఇలా తెలిపారు. ఆయన అమరత్వం పొందడానికి ఒక రోజు ముందు కూడా, ఆయన చందాల గురించి సంప్రదించి, వాటి చెల్లింపుపై ఆందోళన వ్యక్తం చేశారని చెబుతారు. ఆయన జమాత్‌కు సేవ చేయాలనే స్ఫూర్తితో నిండి ఉండేవారు. ఆయన గురించి వ్రాసిన ప్రతి ఒక్కరూ ప్రస్తావించిన గుణాలు ఇవే.

ఆయనకు ఇద్దరు వితంతువులు మరియు పదమూడు మంది కుమారులు, కుమార్తెలు ఉన్నారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయనను మన్నించి, కరుణించు గాకా!.

మూడవ ప్రస్తావన మాలికి చెందిన గౌరవనీయులైన యహ్యా సౌమరే సాహిబ్ గారిది. ఆయన కూడా ఇటీవల 32 సంవత్సరాల వయస్సులో కన్నుమూశారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.

ఆయన కూడా ఒక అమరవీరుడు. ఉగ్రవాదం కారణంగా, మాలిలో కొంత కాలంగా పరిస్థితులు కష్టంగా ఉన్నాయి. యాహ్యా సౌమరే సాహిబ్ సైన్యంలో పనిచేస్తూ, గావ్ ప్రాంతంలోని అనెఫిస్ గ్రామంలో సైనిక విధిలో నియమించబడ్డారు. జూలై 4వ తేదీన వాతావరణం ప్రతికూలంగా ఉండి, బలమైన గాలులు వీస్తున్నాయని చెబుతారు. ఆ సమయంలో, విధి నిర్వహణలో ఉన్న సైనికులను తనిఖీ చేయడానికి వెళ్తానని ఆయన తన కమాండింగ్ అధికారికి చెప్పారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా గస్తీ కాస్తున్న యూనిట్లను తనిఖీ చేయడానికి ఆయన బయటకు వెళ్లినప్పుడు, ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ దాడిలో యాహ్యా సాహిబ్ అమరులయ్యారు.

మాలి స్వాతంత్ర్య దినోత్సవమైన సెప్టెంబర్ 22న ఆయనకు పదోన్నతి కల్పించాలని, అలాగే ఆయనకు మెడల్ ఆఫ్ ఆనర్ కూడా ఇవ్వాలని సైన్యం నిర్ణయించిందని ఆయన గురించి రాసి ఉంది. ఆయనను ఒక పెద్ద నగరానికి బదిలీ చేయాలని కూడా నిర్ణయించారు. అయితే, ఇది జరగకముందే ఆయన అమరులయ్యారు.

అతని సోదరుడు, ఫోడి సౌమారే, ఇలా తెలిపారు: యహ్యా సౌమారే 2022లో జల్సా సలానాకు హాజరయ్యారు. ఆ జల్సా సమయంలో, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి చిత్రాన్ని చూడగానే, ఆయన భావోద్వేగానికి లోనయ్యారు మరియు అద్భుతమైన శాంతి, ప్రశాంతతను అనుభూతి చెందారు. ఆ జల్సాలో, ప్రసంగాలు విన్న తర్వాత మరియు జమాత్ సాహిత్యాన్ని, ముఖ్యంగా స్థానిక భాషలోకి అనువదించబడిన ఇస్లాం తత్వజ్ఞానం ను అధ్యయనం చేసిన తర్వాత ఆయన విశ్వాసం మరింత బలపడింది. జిహాద్ విషయంలో అహ్మదీయ ముస్లిం సమాజం యొక్క హేతుబద్ధమైన మరియు ఇస్లామీయ వైఖరి అతని హృదయాన్ని ఎంతగానో ప్రభావితం చేసింది. ఆ పవిత్రమైన జల్సా సలానా రోజున, అతను బైఅత్ చేసి అహ్మదీయ ముస్లిం జమాత్‌లో చేరాడు.

అతను ఒక ఆదర్శప్రాయమైన భర్త అని, తన బిడ్డ పట్ల ఎంతో దయగల తండ్రి అని, వారి అవసరాలను జాగ్రత్తగా చూసుకునేవాడని అతని భార్య వ్రాసారు. ప్రతి కష్ట సమయంలోనూ వారికి అతను గట్టి అండగా నిలిచాడు. తమతో అతనికి గొప్ప ప్రేమ, గౌరవంతో కూడిన బంధం ఉండేదని అతని తల్లిదండ్రులు తెలిపారు. అతను క్రమం తప్పకుండా ఫోన్ చేసి వారి యోగక్షేమాలు అడిగేవాడు, వారి అవసరాలను తీర్చేవాడు మరియు వారు ఎదుర్కొన్న ప్రతి కష్టాన్ని దూరం చేయడానికి ప్రయత్నించేవాడు. అతను చాలా విధేయుడైన కుమారుడు.

మాలి మిషనరీ-ఇన్-ఛార్జ్ ఇలా వ్రాశారు: అతను ఉల్లాసంగా, ఆహ్లాదకరంగా ఉండే యువకుడు; ఉపవాసాలు, నమాజ్‌లు క్రమం తప్పకుండా చేసేవాడు, అవసరంలో ఉన్నవారి పట్ల శ్రద్ధ చూపేవాడు, తన ప్రజలకు మరియు ఇతరులకు ఒక ఉత్తమ ఆదర్శం, కుటుంబ బంధాలను నిలబెట్టుకోవడంలో విశ్వాస పాత్రుడు, మరియు ఒక నీతిమంతుడు, నిజాయితీపరుడు. మృతుడు నూతన అహ్మదీయుడైనప్పటికీ, ఆయనకు అహ్మదీయ ముస్లిం జమాత్, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) మరియు ఖలీఫాల పట్ల అసాధారణమైన అభిమానం, గాఢమైన అనుబంధం, గౌరవం మరియు నిజమైన ప్రేమ ఉండేవి.

ఆయన తండ్రి అహ్మదీయుడు కాదు. అయినప్పటికీ, తన కుమారుడు అమరుడైన తర్వాత, జమాఅత్ చూపిన దయను, వారు అన్ని పనులను నిర్వహించిన తీరును చూసి, ఆ సానుభూతికి ఆయన ఎంతగానో చలించిపోయారు. ఆయన అప్పటికే జమాఅత్ గురించి పరిశోధన చేస్తుండేవారు, మరియు అహ్మదీయత్ సత్యం ఇప్పుడు తనకు స్పష్టమైందని ఆయన అన్నారు. ఈ కారణంగా, ఆయన అహ్మదీయత్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు.

తరువాత ప్రస్తావన గౌరవనీయులైన సిరాజుల్-హఖ్ ఖురేషీ సాహిబ్ గారిది, ఆయన నాయిబ్ అఫ్సర్ జల్సా సలానా రబ్వాగా సేవ చేసేవారు. ఆయన కూడా ఇటీవల 86 సంవత్సరాల వయస్సులో కన్నుమూశారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. అల్లాహ్ అనుగ్రహం వల్ల, ఆయన ఒక ముసీ.


ఆయన తాతగారైన హజ్రత్ మియాఁ కుతుబుద్దీన్ సాహిబ్ (రజి) ద్వారా ఆయన కుటుంబంలోకి అహ్మదీయత్ ప్రవేశించింది. ఆయన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి సహచరుడు. ఆయనకు ఒక కలలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రత్యక్షమైనట్లు కనిపించింది. దాని ప్రకారం, ఆయన ఖాదియాన్‌కు వెళ్లి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి చేతుల మీదుగా బైఅత్ చేశారు. ఆయన నాయనమ్మ కూడా ఒక సహచరి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అతని తాతగారికి ఖురేషీ ఫజల్-ఎ-హఖ్ సాహిబ్ మరియు ఖురేషీ అబ్దుల్ ఘనీ సాహిబ్ అనే ఇద్దరు కుమారులను ప్రసాదించాడు. ఆ ఇద్దరు కుమారులు జమాఅత్ సేవకు ఎంతో అంకితభావంతో ఉండేవారు. వ్యాపారంలో నిమగ్నమై ఉన్నప్పటికీ, వారు ఎల్లప్పుడూ జమాఅత్ సేవ చేయడానికి సిద్ధంగా ఉండేవారు. రబ్వా అభివృద్ధి మరియు స్థిర నివాసంలో, ముఖ్యంగా నీటి అన్వేషణ ప్రారంభమైనప్పుడు, వారు కీలక పాత్ర పోషించారు; ఆ సమయంలో, చేతిపంపులు మరియు అలాంటి ఇతర ఏర్పాట్లు చేసే పని వారికి అప్పగించబడింది.

ఖురేషీ సిరాజ్-ఉల్-హఖ్ సాహిబ్ యొక్క తల్లి తరఫు తాతగారైన మౌల్వీ ముహమ్మద్ ఉస్మాన్ సాహిబ్ కూడా ఒక సహచరుడే. ఇటీవలి కాలంలో, సిరాజ్-ఉల్-హఖ్ సాహిబ్ నాయిబ్ నజీర్ మరియు నాయిబ్ అఫ్సర్ జల్సా సలానాగా సేవలు అందించారు. ఆయన సుమారు 15 నుండి 20 ఏళ్ల క్రితం జమాత్ సేవలో క్రమబద్ధంగా చేరారు. అంతకుముందు, ఆయన విద్యాశాఖలో పనిచేస్తూ వివిధ కళాశాలల్లో బోధించారు. ఆయన రబ్వాలోని టి.ఐ. కళాశాలలో కూడా బోధన చేశారు.

సయ్యద్ ఖాసిం అహ్మద్ సాహిబ్ ఇలా పేర్కొన్నారు: సిరాజ్-ఉల్-హక్ ఖురేషీ సాహిబ్ మరణంతో, జల్సా సలానా కార్యాలయంలోని సిబ్బంది అందరూ, ఎంతో సానుభూతి, కరుణ కలిగిన ఒక సహోద్యోగిని మరియు పెద్దవారిని కోల్పోయామని భావిస్తున్నారు. ఆయనకు ఏ బాధ్యత అప్పగించినా, దానిని ఎంతో బాధ్యతాయుతంగా పూర్తి చేసేవారు.

ఆయనకు ఇద్దరు కుమార్తెలు మరియు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన కుమారులలో ఒకరైన ఖమర్-ఉల్-హక్ ఖురేషీ సాహిబ్, జమాత్ మిషనరీగా

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)



Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

ఉంటూచారిత్రక విభాగంలో సేవలందిస్తున్నారు. అల్లాహ్ తాలా మృతుడిని మన్నించు గాకా! కరుణించుగాకా!.

తదుపరి ప్రస్తావన నైజీరియాకు చెందిన జమాత్ స్థానిక మిషనరీ, గౌరవనీయులైన లావల్ తయ్యబ్ సాహిబ్ గారిది. ఆయన కూడా ఇటీవల 30 ఏళ్ల వయస్సులో కన్నుమూశారు. **ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్.**

అల్లాహ్ అనుగ్రహంతో, ఆయన ఒక 'ముసీ'. జల్సా సలానా రోజుల్లో, ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు జరుగుతున్నప్పుడు, మసీదు వద్ద శాటిలైట్ డిష్‌ను సరిచేస్తుండగా ఆయన నిచ్చెనపై నుండి పడి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స అందించినప్పటికీ, ఆయన ప్రాణాలను కాపాడుకోలేకపోయారు. ఆయన వెన్నెముకకు తీవ్రమైన గాయమైంది. ఆయన కుటుంబంలో తల్లిదండ్రులు, భార్య మరియు సుమారు పదకొండు నెలల వయస్సు గల కుమార్తె ఉన్నారు.

ఆయన 2018లో నైజీరియాలోని 'జామియాతుల్ ముబషరీన్' లో తన విద్యను పూర్తి చేసి, స్థానిక మిషనరీగా నియమితులయ్యారు. ఆయన ఎంతో వినయవంతులు, చురుకైన మరియు నిజాయితీ గల మిషనరీ. జమాత్ అప్పగించిన ఏ బాధ్యతనైనా, తన శక్తి మేరకు ఎంతో శ్రద్ధతో, కష్టపడి, నిజాయితీతో పూర్తి చేసేవారు.

ఆయన తల్లిదండ్రులు ఇలా తెలిపారు: ఆయన ఎంతో బాధ్యతాయుతమైన కుమారుడు; తన తల్లిదండ్రుల పట్ల ఎంతో శ్రద్ధ వహిస్తూ వారికి సేవలు చేసేవారు. పరిమితమైన ఆర్థిక వనరులు ఉన్నప్పటికీ, అతను తన తల్లిదండ్రుల ఆర్థిక అవసరాలను తీర్చడానికి తన శక్తి మేరకు ఎల్లప్పుడూ ప్రయత్నించేవారు. తన జమాత్ బాధ్యతలను నెరవేర్చడంతో పాటు, అతను ఇస్లామిక్ బోధనలను మరియు ఖిలాఫత్-ఎ-అహ్మదీయ్యా మార్గదర్శకత్వాన్ని ఆచరణాత్మకంగా పాటించేవారని అతని భార్య చెబుతారు. అతని ఉత్తమమైన నైతిక విలువలు, చిత్తశుద్ధి మరియు దయ కారణంగా, అతను జమాత్ సభ్యులు, ఇతర ముస్లింలు మరియు ముస్లిమేతరులచే సమానంగా ప్రేమించబడ్డారు.

స్థానిక ముఅల్లిమ్ అయిన మునవ్వర్ సాహిబ్ కూడా ఇలా తెలిపారు: మృతుడు చాలా మంచి నైతిక విలువలను కలిగి ఉన్నారు. అతనికి గొప్ప సహనం, ధైర్యం ఉండేవి మరియు ఇతరులను ప్రోత్సహించేవారు. విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే, అతనికి జమాత్‌కు సేవ చేయాలనే ప్రగాఢమైన తపన ఉండేది. తీవ్రమైన గాయం, అనారోగ్యం మరియు నొప్పితో బాధపడుతూ అనారోగ్యంతో ఉన్నప్పుడు కూడా, అతను జమాఅత్ విషయాల గురించి మరియు సభ్యుల నైతిక, ఆధ్యాత్మిక శిక్షణ గురించి అడుగుతూనే ఉండేవారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అతనికి క్షమను, కరుణను ప్రసాదించుగాకా!.

తరువాత ప్రస్తావన కెనడాలో నివసిస్తున్న గౌరవనీయులైన రిటైర్డ్ మాస్టర్ గఫూర్ అహ్మద్ సాహిబ్ గారిది. ఆయన సంగ్లా హిల్ లోని ఒక గ్రామంలో అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఆయన కూడా ఇటీవలే కన్నుమూశారు. **ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్.**

ఆయన క్రమం తప్పకుండా ఐదు పూటల నమాజు చేసేవారు, తహజ్జుద్ పట్ల భక్తిశ్రద్ధలు కలవారు, స్నేహశీలురు, ఖిలాఫత్ పట్ల ప్రగాఢమైన అనుబంధం కలవారు మరియు జమాత్ వ్యవస్థకు, ఖిలాఫత్ కు ఎల్లప్పుడూ విధేయులుగా ఉండేవారు. ఆయన ఇతరుల అవసరాల పట్ల కూడా శ్రద్ధ చూపేవారు మరియు కొంత మందికి నిశ్శబ్దంగా ఆర్థిక సహాయం అందించేవారు. ఆయన జమాత్‌కు చందాలు ఇవ్వడంలో మరియు ఇతర ఆర్థిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఆయన క్రమం తప్పకుండా జుమా ప్రసంగాలను వినేవారు మరియు ఇతరులను కూడా అలాగే వినమని ప్రోత్సహించేవారు. ఆయనకు జమాత్ కార్యకర్తల పట్ల మరియు జీవితాంతం భక్తితో జీవించే వారి పట్ల గొప్ప గౌరవం ఉండేది.

ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఐదుగురు కుమారులు, అలాగే మనవళ్లు మనవరాళ్లు ఉన్నారు. ఆయన కుమారులలో ఒకరైన నయీమ్ ఇక్బాల్ సాహిబ్, ఫిజీకి అమీర్ మరియు మిషనరీ-ఇన్-ఛార్జ్‌గా ఉన్నారు. తన తండ్రి మరణించిన సమయంలో ఆయన సేవా రంగంలో ఉన్నందున, అంత్యక్రియలకు హాజరు కాలేకపోయారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయనకు సహనాన్ని, స్థిరత్వాన్ని ప్రసాదించుగాకా! మరియు మృతుడిని మన్నించుగాకా! క్షమించుగాకా!. ఆమీన్.

ప్రపంచ అహ్మదీయ్య జమాఅత్ సభ్యులకు ఒక ముఖ్య ప్రకటన:

మన ప్రియతమ ఖలీఫా, అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి శుభప్రదమైన సూచన మేరకు తమను తాము ఆధ్యాత్మికపరమైన పటిష్టమైన కోటలో చేర్చుకొనుటకు ప్రతి రోజు ఈ క్రింది దుఆలను పఠించగలరు:

(1) సుబ్‌హానల్లాహి వబిహమ్‌దిహీ సుబ్‌హానల్లాహిల్ అజీమ్ అల్లాహుమ్మ సల్లెఅలా ముహమ్మదిన్ వ్వ అలే ముహమ్మద్. (200 సార్లు పఠించవలెను)

(2) అస్తఘ్‌ఫిరుల్లాహ రబ్బి మిన్‌కుల్లి జన్‌బిన్ వ్వఅతూబు ఇలైహి. (100)

(3)రబ్బికుల్లి షైయిన్ ఖాదిముక రబ్బి ఫాహ్‌ఫజ్‌నీ వన్‌సుర్‌నీ వర్‌హమ్‌నీ.

100 సార్లు పఠించవలెను.

(2వ పేజీ తరువాత)

రెండవది: మహ్రమ్ కాని (రక్త సంబంధీకులు కాని) వారి మాటలు వినకుండా మీ చెవులను కాపాడుకోండి. మూడవది: మహ్రమ్ కాని వారి కథలను వినవద్దు. నాలుగవది: చెడు పనులు చేసే భయం ఉన్న అన్ని సంఘటనలు మరియు సందర్భాల నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి. యువతకు ఐదవ విషయం ఏమిటంటే, వివాహం మరియు పెళ్లి విషయంలో ఏదైనా జాగ్రత్త అవసరమైతే, ఉపవాసం ఉండండి.

ఆ తర్వాత మరో దురాచారం అవినీతి మరియు అశ్లీలత:

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా పేర్కొన్నారు: ఎక్కడైతే మీరు దురాచారాలు, అశ్లీలత జరిగే సమావేశాలను చూస్తారో, అక్కడి నుండి లేచి వెళ్ళండి.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడాన్ని కూడా హుజూర్ (అ) నిషేధించారు.

దౌర్జన్యం నుండి కూడ దూరంగా ఉండాలని కూడా హుజూర్ (అ) సూచించారు.

ఫర్జ్ (తప్పనిసరి) నమాజులతో పాటు, తహజ్జుద్ మరియు నవాఫిల్ నమాజుల ఆవశ్యకతను కూడా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తెలియజేశారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలిపారని హదీసులో పేర్కొనబడింది: "నా సేవకుడు నవాఫిల్ నమాజుల ద్వారా నాకు దగ్గరవుతాడు, చివరికి నేను అతనిని ప్రేమించడం ప్రారంభిస్తాను."

అదే విధంగా, ప్రవక్త (స) తస్బీహ్ మరియు తహ్మీద్‌లను పఠించాలని కూడా సూచించారు.

బిస్మిల్లాహ్ అని ప్రారంభించబడని ప్రతి ముఖ్యమైన పని శుభప్రదము కాకుండా ఉంటుందని హదీసులో పేర్కొనబడింది.

అదేవిధంగా, కృతజ్ఞతకు గొప్ప ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం ఉంది.

దురూద్ షరీఫ్‌ను మీ జీవితంలో ఒక భాగంగా చేసుకోండి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "ఎవరైనా నాపై ఒక్కసారి దురూద్ పంపితే, అల్లాహ్ అతనిపై పది రెట్లు తన కరుణను పంపుతాడు."

అదేవిధంగా, పశ్చాత్తాపం మరియు క్షమాపణ కోరడంపై గొప్ప శ్రద్ధ పెట్టవలసిన అవసరం ఉంది.

ఎవరైతే పశ్చాత్తాపాన్ని మరియు క్షమాపణ కోరడాన్ని విధిగా చేసుకుంటారో, అల్లాహ్ వారికి ప్రతి కష్టం నుండి ఒక మార్గాన్ని చూపిస్తాడు, ప్రతి దుఃఖం నుండి వారిని విముక్తి చేస్తాడు, మరియు వారు ఊహించని చోటు నుండి వారికి జీవనోపాధిని కల్పిస్తాడు అని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలిపారు.

అల్లాహ్ ప్రాణుల పట్ల సత్ప్రవర్తన కూడా అత్యవసరం.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా పేర్కొన్నారు: చూడండి! ఒకరినొకరు భుజించుకుంటూ, వారిలో నలుగురు కలిసి కూర్చుని, తమ పేద సోదరుడి గురించి ఫిర్యాదు చేస్తూ, అతడిని విమర్శిస్తూ, బలహీనులను మరియు పేదలను అవమానిస్తూ, ద్వేషంతో చూసే సమాజం, సత్ప్రవర్తన గల సమాజంగా గుర్తింపబడదు.

హజ్రత్ అన్వర్ ఇలా అన్నారు: ఈ కొన్ని విషయాలను నేను ప్రస్తావించాను.

మనలో మనం ఒక స్వచ్ఛమైన మార్పును సృష్టించుకుని, బైఅత్ హక్కును నెరవేర్చి, ఈ బైఅత్ షరతులను పూర్తిగా అమలు చేస్తే, అప్పుడు మనం మనలో ఒక స్వచ్ఛమైన సమాజాన్ని సృష్టించడమే కాకుండా, ప్రపంచంలో ఇస్లాం యొక్క నిజమైన సందేశాన్ని వ్యాప్తి చేసినవారమవుతాము. అంతేకాకుండా, ముస్లింలు మరియు ముస్లిమేతరులలోనే కాకుండా, నాస్తికులు మరియు ఇస్లాం వ్యతిరేకులలో కూడా అటువంటి విద్యను వ్యాపింపజేయువారమవుతాము. ఇది ఒకానొక రోజు, ప్రపంచంలో దైవ ప్రభుత్వాన్ని స్థాపించాలని మరియు ఉన్నత నైతిక విలువలను సృష్టించాలని కోరుకునేది అహ్మదీయులేనని వారు ఆలోచించేలా చేస్తుంది.

ఈ రోజుల్లో, ఇస్లాం వ్యతిరేక శక్తులు ప్రపంచం నుండి దేవుని నామాన్ని తుడిచివేయడానికి, ప్రపంచంలో గందరగోళాన్ని సృష్టించడానికి తమ శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితిలో, బైఅత్ హక్కును నెరవేర్చడానికి, పోరాడటానికి, దేవుని అనుగ్రహం కోసం వేడుకోవడానికి, మరియు వారి ఇస్లాం వ్యతిరేక కుతంత్రాలను అడ్డుకోవడానికి మన శాయశక్తులా ప్రయత్నించడానికి మనపై గొప్ప బాధ్యత ఉంది.

అలా చేయడానికి సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!.

మన ప్రార్థనలలో, యావత్ ప్రపంచ శాంతి మరియు భద్రత కోసం, మరియు ముస్లింల మనుగడ మరియు భద్రత కోసం ప్రార్థించవలెను. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రతి అహ్మదీన్ని అల్లాహ్ పాలనను స్థాపించడంలో మరియు ప్రపంచంలో శాంతి భద్రతలను వ్యాప్తి చేయడంలో భాగస్వామిని చేయుగాకా!.

ఆ తర్వాత, హజ్రత్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు దుఆ చేయించారు.

చివరగా, హజ్రత్ అన్వర్ మాట్లాడుతూ, ఈ సమయానికి హాజరు నివేదిక ప్రకారం, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దయవల్ల, 51,181 మంది ప్రజలు ఈ సభలో హాజరై ప్రసంగాన్ని వింటున్నారు.

ఈ జల్సాలో 117 దేశాల ప్రజలు పాల్గొన్నారు. **(సమాప్తం)**

సీరత్ ఖాతమున్నబియ్యీన్
(సల్లల్లాహు అలైహి వసల్లం):-



రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

ముస్లింలు అనుభవించిన కష్టాలకు కొన్ని ఉదాహరణలు:-

ఆ రోజుల్లో ముస్లింలకు ఎదురైన కష్టాలు, బాధలు ఏమిటో ఆ కష్టాలను స్వయంగా అనుభవించినవారికే పూర్తిగా తెలుసు. అయితే, చరిత్ర ఆ సంఘటనలను ఎంతవరకు భద్రపరిచిందో, వాటిలో కొన్ని ఉదాహరణలు క్రింద ఇవ్వబడ్డాయి. వాస్తవానికి జరిగిన సంఘటనలతో పోలిస్తే, చరిత్రలో నమోదైనవి చాలా తక్కువే.

హజ్రత్ ఉస్మాన్ (రజియల్లాహు అన్హు) బనూ ఉమయ్యా వంశానికి చెందినవారు. వారు (రజి) నిండు యవ్వనస్తులు, సౌకర్యవంతమైన జీవితాన్ని గడుపుతున్న వ్యక్తి. అయినప్పటికీ, ఖురైషులు పైన పేర్కొన్న నిర్ణయం తీసుకున్న తరువాత, వారి పిన్నాన్న హకం బిన్ అబుల్ ఆసు వారిని తాళ్లతో కట్టి కొట్టాడు. కానీ వారు(రజి) ఆ కష్టాన్ని భరిస్తూ కనీసం 'ఉఫ్' అని కూడా అనలేదు.

జుబైర్ బిన్ అవ్వామ్ (రజియల్లాహు అన్హు) అసద్ తెగకు చెందిన ధైర్యవంతుడైన యువకుడు. అయితే, వారి క్రూరుడైన పిన్నాన్న వారిని చాపలో చుట్టి, ఇస్లాంను విడిచిపెట్టేలా చేయడానికి వారి ముక్కులోకి అగ్ని పొగను వదిలేవాడు. అయినప్పటికీ, జుబైర్ (రజి) ఎంతో సంతోషంగా ఆ బాధను సహించేవారు. వారు (రజి) ఇలా అనేవారు: "సత్యాన్ని తెలుసుకున్న తరువాత నేను దానిని తిరస్కరించలేను."

సయీద్ బిన్ జైద్ (రజియల్లాహు అన్హు), హజ్రత్ ఉమర్ (రజి)గారి బావ మరిది. వారు బనూ అదీ తెగకు చెందినవారు, తమ సమాజంలో గౌరవనీయమైన వ్యక్తి. అయితే, ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి)కు వారు ఇస్లాం స్వీకరించిన విషయం తెలిసినప్పుడు, వారిని కింద పడేసి, వారి ఛాతీపై కూర్చున్నారు. ఈ ఘర్షణలో తన సోదరిని కూడా గాయపరిచారు.

అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజియల్లాహు అన్హు),వీరు హుదైల్ తెగకు చెందిన వారు. వారిని ఖురైషులు కాబా ప్రాంగణంలోనే తీవ్రంగా కొట్టి, వారిని హతమార్చే స్థితికి తీసుకువచ్చారు.

అబూ జర్ గఫ్ఫారీ (రజియల్లాహు అన్హు)ను ఖురైషులు ఎంతగా కొట్టారంటే, వారు నేలపై పడిపోయే వరకు కొడుతూనే ఉన్నారు. దాదాపు వారిని చంపివేసే పరిస్థితి ఏర్పడింది. అయితే, అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ ఖురైషులతో ఇలా చెప్పి గఫ్ఫారి (రజి)ను వారి బారి నుంచి విడిపించారు:

"ఈ వ్యక్తి బనూ గిఫ్ఫార్ తెగకు చెందినవాడని మీకు తెలుసా?. ఆ తెగ ప్రజలు మీ సిరియా వ్యాపార మార్గంలో నివసిస్తున్నారు. వారికి ఈ విషయం తెలిస్తే, వారు మీ వ్యాపార మార్గాన్ని అడ్డుకుంటారు."

ఇలాంటి కఠినమైన హింసలు బలమైన తెగలకు చెందిన వారిపైనే జరిగాయి. మరి బానిసల, ఇతర బలహీనుల పరిస్థితి ఎలా ఉండేదో చదివితేనే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. క్రింద ఇవ్వబడిన కొన్ని ఉదాహరణలు ఖురైషులు చేసిన దురాగతాలకు సంబంధించిన అతి చిన్న ఉదాహరణ మాత్రమే.

హజ్రత్ బిలాల్ బిన్ రబాహ్ (రజియల్లాహు అన్హు): బిలాల్ బిన్ రబాహ్ (రజి) ఉమయ్యా బిన్ ఖలఫ్‌కు చెందిన ఒక హబ్షీ (అబిసీనియా ప్రాంతానికి చెందిన) బానిస.అరబ్‌లో మధ్యాహ్న సమయంలో, ఆకాశం నుంచి నిప్పుల వర్షం కురుస్తున్నట్లుగా ఎండ మండుతున్నప్పుడు, మక్కాలోని ఇసుకనేల కొలిమిలా వేడెక్కి పోయేది. అలాంటి సమయంలో ఉమయ్యా వారిని బయటకు తీసుకువెళ్లి, బట్టలు తొలగించి, వేడెక్కిన నేలపై పడుకోబెట్టేవాడు. అనంతరం పెద్ద పెద్ద వేడి రాళ్లను వారి ఛాతీపై ఉంచి ఇలా బెదిరించేవాడు: "లాత్, ఉజ్జా దేవతలను ఆరాధించు. ముహమ్మద్‌ను విడిచిపెట్టు. లేకపోతే, ఇలాగే హింసించి నిన్ను చంపేస్తాను." బిలాల్ (రజి)కు అరబీ భాషలో ఎక్కువగా మాట్లాడటం రాదు. అందుకే వారు కేవలం "అహద్, అహద్" అని మాత్రమే అనేవారు. అంటే, "అల్లాహ్ ఒక్కడే, అల్లాహ్ ఒక్కడే" అని అర్థం. ఈ సమాధానం విన్న ఉమయ్యా మరింత క్రూరంగా ప్రవర్తించే వాడు. వారి మెడకు తాడు కట్టి, కొందరు అల్లరి పిల్లలకు అప్పగించేవాడు. ఆ పిల్లలు వారిని మక్కాలోని రాతి వీధులు, సందుల గుండా ఈడ్చుకెళ్లేవారు. దాంతో వారి శరీరం రక్తంతో తడిసిపోయేది. అయినప్పటికీ, వారి నాలుకపై "అహద్, అహద్" అనే పదాలు తప్ప మరే మాటా వచ్చేది కాదు. హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) బిలాల్ (రజి)పై జరుగుతున్న ఈ దౌర్జన్యాలను చూసి, పెద్ద మొత్తంలో ధనం చెల్లించి వారిని కొనుగోలు చేసి బానిసత్వం నుంచి విముక్తి కల్పించారు.

అబూ ఫకీహ్ (రజియల్లాహు అన్హు): వీరు సఫ్వాన్ బిన్ ఉమయ్యా యొక్క బానిసగా ఉండేవారు. వారిని కూడా ఇతరుల మాదిరిగానే మండే వేడి నేలపై పడుకో బెట్టి, వారి ఛాతీపై చాలా బరువైన రాళ్లను పెట్టేవారు. దాంతో వారి నాలుక బయటకు వచ్చేది.

ఆమిర్ బిన్ ఫుహైరా (రజియల్లాహు అన్హు): వీరు కూడా ఒక బానిస. వీరు ఇస్లాం స్వీకరించినందుకు వీరికి కూడా తీవ్రమైన హింసలు, కష్టాలు కలిగించే వారు. హజ్రత్ అబూబకర్ (రజి) వారిని కొనుగోలు చేసి, తన వద్ద మేకలను కాసే పనిలో నియమించుకున్నారు.

లుబైనా (రజియల్లాహు అన్హా): వీరు బనూ అదీ తెగకు చెందిన ఒక బానిస మహిళ. ఆమె ఇస్లాం స్వీకరించకముందు, హజ్రత్ ఉమర్ (రజి)ఆమెను ఎంతగా కొట్టేవారంటే, కొడుతూ కొడుతూ అలసిపోయేవారు. అయితే కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత మళ్లీ అదే విధంగా కొట్టడం ప్రారంభించేవారు. ఆమె మాత్రం ఎదురుగా నిలబడి, "ఓ ఉమర్! ఒకవేళ నీవు ఇస్లాంను స్వీకరించకపోయినచో, ఈ అన్యాయాన్ని అల్లాహ్ తప్పకుండా ప్రతీకారం తీర్చుకుంటాడు." అని చెప్పేది.

జునైరా (రజియల్లాహు అన్హా): వీరు బనూ మఖ్జూమ్ తెగకు చెందిన ఒక బానిస మహిళ. అబూ జహల్ ఆమెను చాలా క్రూరంగా కొట్టేవాడు. దాంతో ఆమె తన కంటి చూపును కోల్పోయింది. అబూ జహల్ ఆమెను చూపిస్తూ ఎగతాళిగా ఇలా అనేవాడు: "ఇస్లాం నిజమైన మతమే అయితే, ఆమెకు ఈ పరిస్థితి ఎందుకు కలిగింది? మరి మనకు మాత్రం అది ఎందుకు లభించలేదు?"

సుహైబ్ బిన్ సినాన్ రూమీ (రజియల్లాహు అన్హు): వీరు బానిస కాదు. అంతేకాకుండా, ఆర్థికంగా కూడా వారు కొంత సుఖంగా ఉండేవారు. అయినప్పటికీ, ఖురైషులు వారిని ఎంతగా కొట్టేవారంటే, వారు స్పృహ కోల్పోయేవారు. హజ్రత్ ఉమర్ (రజి) గాయపడినప్పుడు, వారు ఈ సుహైబ్ (రజి) గారినే నమాజుకు ఇమామ్‌గా నియమించారు. అలాగే హజ్రత్ ఉమర్ (రజి) జనాజా నమాజును కూడా ఈ సుహైబ్ (రజి) గారే చదివించారు.

ఖబ్బాబ్ బినిల్ అరస్ (రజియల్లాహు అన్హు): వీరు కూడా బానిస కాదు. వారు స్వతంత్ర వ్యక్తి. వారు కమ్మరి పని చేసేవారు. అయితే ఒకసారి ఖురైషులు వారిని పట్టుకుని, వారి సొంత బట్టిలో మండుతున్న నిప్పులపై బోర్లా పడుకోబెట్టారు. వారు కదలకుండా ఉండేందుకు ఒక వ్యక్తి వారి ఛాతీపై ఎక్కి కూర్చున్నాడు. ఫలితంగా, ఆ నిప్పులు వారి శరీరం కింద మండుతూనే ఉండి, చివరకు కాలుతూ కాలుతూ చల్లారి పోయాయి. చాలా కాలం తర్వాత ఖబ్బాబ్ (రజి)ఈ సంఘటనను హజ్రత్ ఉమర్ (రజి) గారికి వివరించారు. తన వీపును చూపించారు. హింస వల్ల ఏర్పడిన గాయాల మచ్చలతో వారి వీపు పూర్తిగా తెల్లగా మారిపోయి ఉండేది.

ఖబ్బాబ్ (రజి) గురించి మరో సంఘటన కూడా ప్రస్తావించబడింది. ఒకసారి మక్కాకు చెందిన ప్రముఖుడు ఆస్ బిన్ వాయిల్ వారితో కొన్ని ఖడ్గాలను తయారు చేయించుకున్నాడు. ఖబ్బాబ్ (రజి) వాటి ధరను అడిగినప్పుడు, అతడు ఇలా అన్నాడు: "మీరు స్వర్గంలో మనిషి కోరుకున్న అన్ని రకాల సుఖసంతోషాలు, బంగారం, వెండి మొదలైనవన్నీ లభిస్తాయని చెబుతున్నారు కదా! కాబట్టి, నీ ఖడ్గాల ధరను స్వర్గానికి వచ్చిన తర్వాత నా దగ్గర తీసుకో." అతడు ఇంకా ఇలా అన్నాడు:"అల్లాహ్ ప్రమాణం! నువ్వు స్వర్గానికి వెళ్తానని ఆశిస్తున్నట్లయితే, నేను అంతకంటే ఎక్కువగా స్వర్గానికి వెళ్లడానికి అర్హుడిని కదా!" అని, అతడు ఖడ్గాల ధర చెల్లించడానికి నిరాకరించాడు.

అమ్మార్ (రజియల్లాహు అన్హు), వారి తండ్రి యాసిర్ (రజి), వారి తల్లి సుమయ్యా (రజియల్లాహు అన్హా)లను బనూ మఖ్జూమ్ తెగవారు అత్యంత క్రూరంగా హింసించే వారు. సుమయ్యా ఒకప్పుడు వారి బానిసగా ఉండేవారు. వారు ఈ ముగ్గురికీ విధించిన బాధలను చదివితేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది. ఒకసారి, ఇస్లాం కోసం తమ ప్రాణాలను సైతం అర్పించడానికి సిద్ధపడిన ఈ విశ్వాసుల సమూహం శారీరక హింసను అనుభవిస్తున్న సమయంలో, అనుకోకుండా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అటుగా వచ్చారు. ప్రవక్త (స) వారి వైపు చూసి, ఎంతో బాధతో, దయతో ఇలా అన్నారు: صَبْرًا اٰلَ يَاسِرٍ فَاِنَّ مَوْعِدَكُمُ الْجَنَّةَ అనగా "ఓ యాసిర్ కుటుంబ సభ్యులారా! సహనాన్ని విడిచిపెట్టకండి. నిశ్చయంగా, అల్లాహ్ తాలా మీరు పడే ఈ బాధల వలనే మీ కొరకు స్వర్గాన్ని సిద్ధం చేసి ఉంచాడు." చివరికి, యాసిర్ (రజి) ఆ హింసను అనుభవిస్తున్నప్పుడే ప్రాణాలు విడిచారు. వృద్ధురాలైన సుమయ్యా (రజియల్లాహు అన్హా) తొడలో క్రూరుడైన అబూ జహల్ అత్యంత నిర్దయగా ఈటెతో పొడిచాడు. ఆ ఈటె ఆమె శరీరాన్ని చీల్చుకుంటూ జననాంగాల వరకు వెళ్లింది. ఆ నిరపరాధ మహిళ అక్కడే తీవ్రమైన వేదనతో విలవిల లాడుతూ ప్రాణాలు విడిచారు. ఇప్పుడు అమ్మార్ (రజి) మాత్రమే మిగిలారు. వారిని కూడా ఆ ప్రజలు అత్యంత దారుణంగా హింసించి, ఎన్నో బాధలకు గురి చేశారు. అంతేకాకుండా, "నీవు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పట్ల అవిశ్వాసాన్ని ప్రకటించేంతవరకు నిన్ను ఇలాగే హింసిస్తూనే ఉంటాము" అని బెదిరించారు. చివరికి, భరించలేనంత హింసకు తాళలేక అమ్మార్ (రజి) వారి ఒత్తిడికి లొంగి, పలకకూడని కొన్ని మాటలను నోటితో పలికారు. దాంతో అవిశ్వాసులు వారిని విడిచిపెట్టారు. అయితే, ఆ తర్వాత అమ్మార్ (రజి) వెంటనే ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి సన్నిధికి వెళ్లి బిగ్గరగా విలపించసాగారు. ప్రవక్త (స) వారిని ఇలా అడిగారు: "అమ్మార్ ఏమైంది ? ఎందుకు ఏడుస్తున్నావు?". అందుకు అమ్మార్ (రజి) ఇలా సమాధానమిచ్చారు: "ఓ అల్లాహ్ ప్రవక్తా! నేను నాశనమైపోయాను. ఆ దుర్మార్గులు నన్ను ఎంతగా హింసించారంటే, మీ గురించి పలకరాని కొన్ని మాటలను నేను నోటితో పలికాను." అప్పుడు ప్రవక్త (స) ఇలా అడిగారు: "నీ హృదయం ఇప్పుడు ఎలా ఉందని నీవు భావిస్తున్నావు?" అందుకు అమ్మార్ (రజి) ఇలా సమాధానమిచ్చారు: "ఓ అల్లాహ్ ప్రవక్తా! నా హృదయం ఇప్పటికీ మునుపటిలాగే విశ్వాసంతో నిండి ఉంది. అల్లాహ్ పట్ల, ఆయన ప్రవక్త పట్ల నా ప్రేమ కూడా మునుపటిలాగే నిండి ఉంది." అప్పుడు

ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "అయితే, ఆందోళన చెందకు. నీ ఈ పొరపాటును అల్లాహ్ క్షమిస్తాడు."

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎదుర్కొన్న వ్యక్తిగత కష్టాలు:-

ముస్లింలు ఎదుర్కొంటున్న కష్టాలతో పోల్చి చూసినప్పుడు, హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి వ్యక్తిగత పరిస్థితి కూడా ఈ తీవ్ర వ్యతిరేకతల తుఫానులో ఏమాత్రం సంతృప్తికరంగా లేకుండెను.

ఇంతకుముందు ప్రస్తావించిన బనూ హాషిమ్ మరియు బనూ ముత్తలిబ్ వంశాల నిర్ణయం తరువాత, నిశ్చయముగా ప్రవక్త (స)కు తమ బంధువుల నుంచి సాధారణంగా మద్దతు లభించింది. ఖురైష్ తెగల మధ్య ఉన్న రాజకీయ పరిస్థితుల్లో ఈ మద్దతుకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. కాని ప్రథమముగా, ప్రవక్త (స) వారి సొంత పినతండ్రి అబూ లహబ్ చూపించిన అవిశ్వాసం, ద్రోహం ఆ నిర్ణయ బలాన్ని కొంతవరకు తగ్గించాయి. రెండవది, బనూ హాషిమ్ మరియు బనూ ముత్తలిబ్ వారు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారికి అండగా నిలబడటం మానుకోకపోతే, వారందరినీ ఎదుర్కొంటామని ఖురైషులు కూడా బెదిరించారు. అప్పటి వరకు వారు ఆ బెదిరింపును పూర్తిస్థాయిలో అమలు చేయనప్పటికీ, దాని కోసం సిద్ధమవుతున్నారు. ఎగతాళి చేయడం, నిందలు వేయడం, వాదోపవాదాలకు దిగడం వంటి చర్యలతో పాటు, అప్పుడప్పుడు తమను తాము రక్షించుకుంటూనే ప్రత్యక్షంగా వేధింపులకు కూడా పాల్పడేవారు. ఈ క్రమంలో మొదటగా వారు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఒక ముఖ్యమైన విషయంపై చర్చించారు. హజ్ కాలం సమీపిస్తోంది. ఆ సమయంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే హజ్ యాత్రికుల మధ్య ఇస్లాం గురించి తప్పకుండా చర్చ జరుగుతుంది. ప్రజలు తమ వద్దకు వచ్చి, "ఈ కొత్త ప్రవక్త ఎవరు? ఆయన ఏమి చెబుతున్నారు?" అని అడుగుతారు. అందువల్ల, తమలో తాము సంప్రదించుకుని ఒకే సమాధానాన్ని సిద్ధం చేసుకోవాలని వారు భావించారు. అలా చేస్తే తమ మధ్య ఉన్న భిన్నాభిప్రాయాలు తమ ప్రతిష్ఠకు హాని కలిగించవని వారు అనుకున్నారు. అందదువలన ఖురైషుల ప్రముఖ నాయకులందరూ వలీద్ బిన్ ముగీరా ఇంట్లో సమావేశమయ్యారు. వలీద్ వారిని ఉద్దేశించి ప్రారంభ ప్రసంగం చేసి, మొత్తం పరిస్థితిని వివరించాడు. హజ్ సమయం దగ్గర పడుతోందని, ముహమ్మద్ గారి ప్రవక్తత్వ ప్రకటన గురించి వార్తలు ఇతర ప్రాంతాలకు చేరాయని, హజ్ కోసం వచ్చే ప్రజలు తప్పకుండా వారిని గురించి ప్రశ్నిస్తారని తెలిపాడు. కాబట్టి అందరూ కలిసి చర్చించి ఒక స్థిరమైన సమాధానాన్ని నిర్ణయించుకోవాలని, ఒకరు ఒక మాట, మరొకరు ఇంకొక మాట చెప్పడం ద్వారా తమ ప్రభావాన్ని తామే దెబ్బతీసుకోకూడదని సూచించాడు. అప్పుడు ఒక వ్యక్తి "మన సమాధానం చాలా స్పష్టంగా ఉంది. ఈ వ్యక్తి ఒక జ్యోతిష్కుడు. జ్యోతిష్కుల మాదిరిగా మాట్లాడి కొంతమందిని తనవైపు ఆకర్షించుకున్నాడు." అని ప్రచారం చేద్దాం అని అన్నాడు. అందుకు వలీద్ ఇలా సమాధానమిచ్చాడు: "వారిలో జ్యోతిష్కుల కు సంబంధించిన లక్షణాలేవీ కనిపించనప్పుడు మనం వారిని జ్యోతిష్కుడని ఎలా చెప్పగలం?, జ్యోతిష్కులు మాట్లాడే విధమైన లయ వారి మాటల్లో లేదు. అలాంటి ప్రత్యేకమైన వాక్చాతుర్యం కూడా వారిలో కనిపించదు." మరొక వ్యక్తి ఇలా అన్నాడు: "అయితే, ముహమ్మద్ ఒక పిచ్చివాడు అని చెప్పవచ్చు. తన పిచ్చి ఉన్మాదంలో వారు ఏవేవో మాట్లాడుతుంటాడని చెప్పవచ్చు." అందుకు కూడ వలీద్ ఇలా బదులిచ్చాడు: "ఈ మాటను ఎవరు నమ్ముతారు? ముహమ్మద్‌లో పిచ్చివాడికి ఉండే ఏ లక్షణాలను మనం చూపించగలం?. వారిలో పిచ్చివారికి ఉండే అసాధారణ ప్రవర్తన లేదు, ఆందోళన లేదు, అలాగే వారిలో సాధారణంగా కనిపించే అనుమానాలు, భ్రమలు కూడా లేవు. అలాంటప్పుడు వారిని పిచ్చివాడని మనం చెప్పినా ఎవరు నమ్ముతారు?" అప్పుడు మూడవ వ్యక్తి ఇలా అన్నాడు: "అయితే, ఈ వ్యక్తి ఒక కవి అని చెప్పవచ్చు. తన మాయాజాలం వంటి ప్రభావం కలిగిన కవితలతో ప్రజలను తనవైపు ఆకర్షిస్తున్నాడని చెప్పవచ్చు." అందుకు కూడ వలీద్ ఇలా సమాధానమిచ్చాడు: "వారిని కవి అని పిలిస్తే, వారి మాటల్లో కవిత్వానికి సంబంధించిన ప్రత్యేక లక్షణాలైన రజజ్, హజజ్, ఖరీద్, మఖ్బూద్, మబ్సూత్ వంటి ఛందస్సులను మనం ఎక్కడ చూపించగలం?" అప్పుడు నాలుగవ వ్యక్తి ఇలా అన్నాడు: "వారు ఒక మాంత్రికుడని ప్రచారం చేయాలి." అందుకు వలీద్ ఇలా బదులిచ్చాడు: "అయితే, మాంత్రికులు చేసే విధంగా మంత్రాలు ఊదడం, ముడులు వేయడం, ముడులు విప్పడం వంటి పనులను వారిలో మనం ఎలా చూపించగలం?" అప్పుడు అక్కడున్నవారు ఇలా అన్నారు: "ఓ అబ్దుష్షమ్స్! మరి మనం ఏమి చెప్పాలో నువ్వే చెప్పు." వలీద్ ఇలా సమాధానమిచ్చాడు: "ఈ విషయంలో నేనే అయోమయంలో ఉన్నాను. ఏం చేయాలో నాకు అర్థం కావడం లేదు. నేను ఏ ఆరోపణ గురించి ఆలోచించినా, అది ముహమ్మద్(స)కు సరిపోతున్నట్లు కనిపించడం లేదు. ప్రజలకు నమ్మకం కలిగించని మాటను చెప్పడం అంటే మనమే ఇతరుల నవ్వులపాలవడం." ఈ విధంగా ఆ సమావేశంలో కొంతసేపు చర్చ కొనసాగింది. చివరకు, వేరే మార్గం కనిపించడం లేదని, ప్రతిపాదించిన ఆరోపణలన్నింటిలో మాంత్రికుడనే ఆరోపణ కొంత ఎక్కువ ప్రభావవంతంగా ఉంటుందని వారు నిర్ణయించారు.

అందువల్ల, హజ్ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలందరికీ ముహమ్మద్ (స) గురించి ఒకే మాట చెప్పాలని తీర్మానించారు. అదేమిటంటే:"ఈ వ్యక్తి ఒక మాంత్రికుడు. తన రహస్యమైన మంత్రవిద్య ద్వారా తండ్రిని కొడుకు నుంచి, సోదరుడిని సోదరుడి నుంచి, భర్తను భార్య నుంచి విడదీస్తూ వెళ్తున్నాడు." హజ్ కాలం వచ్చినప్పుడు, ఖురైషులలో చిన్నవారి నుంచి పెద్దవారి వరకు అందరి నోటా ఇదే మాట వినిపించేది: "ముహమ్మద్ ఒక మాంత్రికుడు. ఆయన ఏ ఇంట్లోకి ప్రవేశించినా, ఆ కుటుంబంలో విభేదాలు, చీలికలు సృష్టించి బయటకు వస్తాడు." వారి ఈ దుష్ప్రచారం వల్ల అరేబియాలోని అనేక తెగలలో హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారికి మరియు ఇస్లాంకు వ్యతిరేకంగా తీవ్రమైన ఆందోళన, వ్యతిరేకత ఏర్పడ్డాయి.

ఖురైషులు ఇంతటితోనే ఆగిపోలేదు. మక్కాలోని అల్లరి మూకలను, ఏ పనులు చేయని వ్యక్తులను రెచ్చగొట్టి, ఏ విధంగానైనా సరే ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని నిరంతరం ఇబ్బంది పెట్టాలని ప్రోత్సహించారు. దాంతో, వారి ప్రేరేపణకు లోనైన నగరంలోని అల్లరి స్వభావం గల వ్యక్తులు, ప్రవక్త (స) వారి సమక్షంలోనూ, వారు లేనప్పుడు వారి వెనుక కూడా, రకరకాల అసభ్యమైన మాటలు మాట్లాడేవారు. వారి ఉద్దేశం మనసును బాధపెట్టడం, కోపాన్ని రెచ్చగొట్టడం, తద్వారా కలహాలను సృష్టించడం తప్ప మరొకటి కాదు. ప్రవక్త (స) వారి పొరుగున నివసించే కొందరు వ్యక్తుల దినచర్య ఏమిటంటే, వారి ఇంటిపై రాళ్లు విసరడం, ఇంటి గుమ్మం ముందు ముళ్లను పరచడం, ఇంటిలోపలికి మురికిగా ఉండే, దుర్వాసన వెదజల్లే వస్తువులను తీసుకొచ్చి వేయడం. ఈ వస్తువుల వల్ల ప్రవక్త (స) వారికి ప్రత్యక్షంగా ఏదైనా ఇబ్బంది కలిగినప్పుడు, వారు సంతోషంతో నవ్వుతూ, పెద్దగా కేకలు వేస్తూ హేళన చేసేవారు. ఒకసారి ఒక వ్యక్తి అత్యంత అపరిశుభ్రమైన, తీవ్రమైన దుర్వాసన కలిగిన వస్తువును వారి ఇంటిలోకి విసిరేశాడు. ప్రవక్త (స) స్వయంగా దానిని ఎత్తుకొని బయటకు తీసుకొచ్చి ఇలా అన్నారు:"ఓ బనూ అబ్దె మనాఫ్ వంశస్థులారా! పొరుగువారిగా ఉండవలసిన హక్కును మీరు ఎంత చక్కగా నెరవేరుస్తున్నారు!"అయితే, ఈ మాటలు విన్నవారు, సత్ప్రవర్తనకు సంబంధించిన విజ్ఞప్తిని వినడానికి పూర్తిగా చెవిటివారిలా వ్యవహరించారు. (2) అదే సమయంలో, ఖురైషులు మరో నిర్ణయం కూడా తీసుకున్నారు. ప్రవక్త (స) వారిని "ముహమ్మద్" అని పిలవకుండా, "ముజమ్మమ్" (దూషించబడినవాడు, నిందించబడినవాడు) అని పిలవాలని నిర్ణయించారు. దాంతో కొంతకాలం మక్కాలో ఈ పేరుతో వారిని పిలవడం ప్రచారంలోకి వచ్చింది. అయినప్పటికీ, తమకు ప్రవక్త పదవి లభించకముందు ఇదే వ్యక్తిని "అమీన్" (నమ్మకస్తుడు) అని పిలిచేవారమనే విషయాన్ని గుర్తుచేసుకొని సిగ్గుపడటానికి కూడా ఖురైషులకు మనస్సు రాలేదు. వారి ఈ ప్రవర్తన గురించి ప్రవక్త (స) వారికి తెలిసినప్పుడు, వారు (స) చిరునవ్వుతో ఇలా అన్నారు: "నా పేరు ముహమ్మద్. ముహమ్మద్ అయిన వ్యక్తి 'ముజమ్మమ్' ఎలా అవుతాడు? చూడండి, వారి దూషణల నుంచి అల్లాహ్ నన్ను ఏ విధంగా రక్షిస్తున్నాడో!".

కాని, ఆ కాలంలో కూడా ఖురైషుల వేధింపులు కేవలం మాటలకే పరిమితం కాలేదు. కొన్నిసార్లు వారు ఆవేశంతోనో, అవకాశం చూసుకునో, ప్రవక్త (స)వారికి ప్రత్యక్షంగా హాని కలిగించడానికి, శారీరకంగా బాధపెట్టడానికి కూడా వెనుకాడేవారు కాదు. బహుశా అదే కాలంలో జరిగిన ఒక సంఘటన ఇది. ఒకసారి ప్రవక్త (స) కాబా సమీపంలో నమాజు చేస్తుండగా, ఉఖ్బా బిన్ అబీ ముఐత్ కోపంతో లేచి, వారి మెడకు ఒక వస్త్రాన్ని చుట్టి, వారి ఊపిరి ఆగిపోయేంత బలంగా బిగించాడు. ఈ విషయం హజ్రత్ అబూ బకర్ (రజియల్లాహు అన్హు) వారికి తెలిసిన వెంటనే, వారు (రజి) పరుగెత్తుకుంటూ వచ్చి, ఆ దుర్మార్గుడి బారి నుంచి ప్రవక్త (స) వారిని రక్షించారు. అనంతరం ఖురైషులను ఉద్దేశించి ఇలా అన్నారు: اَتَقْتُلُوْنَ رَجُلًا اَنْ يَّقُوْلَ رَبِّيَ اللّٰهُ అనగా: "నా ప్రభువు అల్లాహ్ అని చెప్పినందుకే మీరు ఒక వ్యక్తిని చంపుతారా?"

మరొక సందర్భంలో, ప్రవక్త (స) కాబా ప్రాంగణంలో ఏకదైవారాధనను ప్రకటించినప్పుడు, ఖురైషులు ఆవేశంతో వారి చుట్టూ గుమిగూడి పెద్ద గందరగోళాన్ని సృష్టించారు. హజ్రత్ ఖదీజా (రజి) వారి మొదటి భర్త కుమారుడు హారిస్ బిన్ అబీ హాలా (రజి)కు ఈ విషయం తెలిసిన వెంటనే, ఆయన పరుగెత్తుకుంటూ అక్కడికి వచ్చారు. అక్కడ నెలకొన్న ప్రమాదకరమైన పరిస్థితిని గమనించి, ఖురైషుల దుర్మార్గం నుంచి ప్రవక్త (స) వారిని రక్షించడానికి ప్రయత్నించారు. అయితే, ఆ సమయంలో ఖురైషుల యువకుల్లో కొందరు ఎంతగానో రెచ్చిపోయి, దుర్బుద్ధి కలిగిన ఒక వ్యక్తి ఖడ్గంతో దాడి చేసి, హారిస్ బిన్ అబీ హాలా (రజి)ను అక్కడికక్కడే కూలదోశాడు.ఆ సమయంలో అక్కడ నెలకొన్న అరుపులు, గందరగోళం కారణంగా ఖడ్గంతో దాడి చేసిన వ్యక్తి ఎవరో తెలుసుకోవడం సాధ్య పడలేదు.

నూరుల్ ఇస్లాం శాఖ:

అహ్మదియ్యా ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.
టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131
సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలువు).

EDITOR : SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
e-mail:
akhbaarbadarteluguqdn@gmail.com
www.akhbarbadr.in

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA తెలుగు వార పత్రిక

POSTAL REG NO GDP-38/2026 -2028. Vol. 11. Thursday, 12 NOV 2026, Issue No : 46

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail
managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/-) (WEIGHT: 20-50, grms / issue)

సీరతుల్ మహ్దీ
(అలైహిస్సలాతు వస్సలాం):-

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

(68) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: హజ్రత్ అమ్మాజాన్ సాహిబా నాకు ఇలా తెలిపారు: "నేను చిన్న అమ్మాయిగా ఉన్నప్పుడు, మీర్ సాహిబ్ (ఈ భవదీయుడి తల్లిగారి తండ్రి) గారికి ఒకసారి ఇక్కడ ఖాదియాన్‌కు బదిలీ అయింది. మేము ఇక్కడ ఆరు లేదా ఏడు నెలలు ఉన్నాము. ఆ తర్వాత మీర్ సాహిబ్ గారికి ఇక్కడి నుంచి మరొక ప్రదేశానికి బదిలీ కావడంతో, వారు మీ పెదనాన్న గారితో మాట్లాడి, మమ్మల్ని మీ పెదనాన్న గారి ఇంట్లో విడిచిపెట్టి వెళ్లారు. ఆ తర్వాత ఒక నెలకు తిరిగి వచ్చి మమ్మల్ని తీసుకెళ్లారు. ఆ సమయంలో మీ పెదనాన్న గారు ఖాదియాన్ బయట నివసించేవారు. ప్రతి ఎనిమిది రోజులకు ఒకసారి ఇక్కడికి వచ్చేవారు. నాకు గుర్తున్నంతవరకు, నేను వారిని చూశాను." ఈ భవదీయుడు ఇలా అడిగాడు: "ఆ రోజుల్లో మీరు హజ్రత్ సాహిబ్‌ను కూడా ఎప్పుడైనా చూశారా?" అందుకు అమ్మాజాన్ సాహిబా ఇలా సమాధానమిచ్చారు: "హజ్రత్ సాహిబ్ అదే ఇంట్లో నివసించేవారు. అయితే నేను వారిని చూడలేదు." ఆ తరువాత ఆ రోజుల్లో హజ్రత్ సాహిబ్ నివసించిన గదిని హజ్రత్ అమ్మాజాన్ సాహిబా నాకు చూపించారు. ప్రస్తుతం ఆ గది మిర్జా సుల్తాన్ అహ్మద్ సాహిబ్ గారి ఆధీనంలో ఉంది. ఈ భవదీయుడు తెల్పున దేమనగా, హజ్రత్ సాహిబ్ మొదటి నుంచే ఏకాంతంగా ఉండటానికి ఇష్టపడే వారు. అందువల్ల హజ్రత్ అమ్మాజాన్ సాహిబాకు వారిని చూసే అవకాశం లభించక పోవచ్చు. మరల ఈ భవదీయుడు అమ్మాజాన్ సాహిబాను "ఇది ఏ కాలం నాటి విషయం?" అని అడిగాడు. అందుకు హజ్రత్ అమ్మాజాన్ సాహిబా సాహిబా ఇలా చెప్పారు: "నాకు ఖచ్చితమైన తేదీ గుర్తులేదు. అయితే మేము ఖాదియాన్‌కు వచ్చిన రోజుల్లో మీ తాతగారి మరణం సందర్భంగా మొదటి వార్షిక సంస్మరణ కార్యక్రమం నిర్వహించ బడిందని నాకు గుర్తుంది.' ఈ భవదీయుడు తెల్పునదేమనగా, ఈ లెక్క ప్రకారం అది 1877వ సంవత్సరం అవుతుంది. ఆ సమయంలో హజ్రత్ అమ్మాజాన్ సాహిబా వయస్సు తొమ్మిది లేదా పది సంవత్సరాలు ఉండవచ్చు. హజ్రత్ సాహిబా వయస్సు బహుశా నలభై సంవత్సరాలకు పైబడి ఉండవచ్చు. (ఈ భవదీయుడు తెల్పునదేమనగా, ఈ గ్రంథం రెండవ ముద్రణ కోసం సిద్ధం చేస్తున్న ప్రస్తుత సమయంలో, హజ్రత్ సాహిబ్ ఆ రోజుల్లో నివసించిన గది, మరొక గదికి బదులుగా మా ఆధీనంలోకి వచ్చింది. అది ఒక పై అంతస్తు గది. ప్రస్తుతం హజ్రత్ అమ్మాజాన్ సాహిబా గారి వంటగది ప్రాంగణానికి ఆనుకుని, దివంగత మిర్జా సుల్తాన్ అహ్మద్ సాహిబ్ గారి ఇంటికి అనుబంధంగా ఉన్న గది ఇదే.)

(69) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం:హజ్రత్ అమ్మాజాన్ సాహిబా నాకు ఇలా తెలిపారు: "నా వివాహానికి ముందే, హజ్రత్ సాహిబ్‌కు తన రెండవ వివాహం ఢిల్లీలో జరుగుతుందని తెలిసింది. అందువల్ల వారు ఈ విషయాన్ని మౌల్వీ ముహమ్మద్ హుస్సేన్ బటాల్వీ గారితో ప్రస్తావించారు. ఆ సమయంలో మౌల్వీ ముహమ్మద్ హుస్సేన్ బటాల్వీ గారి వద్ద అహ్‌లే హదీస్ వర్గానికి చెందిన అమ్మాయిలందరి జాబితా ఉండేది. మీర్ సాహిబ్ కూడా అహ్‌లే హదీస్ వర్గానికి చెందినవారే. ఆయనకు బటాల్వీ గారితో చాలా సన్నిహిత పరిచయం ఉండేది. అందువల్ల బటాల్వీ గారు హజ్రత్ సాహిబ్‌కు మీర్ సాహిబ్ పేరును సూచించారు. హజ్రత్ సాహిబ్ మీర్ సాహిబ్‌కు ఉత్తరం రాశారు. మొదట్లో, వయస్సులో చాలా వ్యత్యాసం ఉండ టంతో మీర్ సాహిబ్ ఈ ప్రతిపాదనను ఇష్టపడలేదు. అయితే చివరికి ఆయన అంగీకరించారు. ఆ తర్వాత హజ్రత్ సాహిబ్ నాతో వివాహం చేసుకోవడానికి ఢిల్లీకి వచ్చారు. వారితో పాటు షేక్ హామిద్ అలీ, లాలా ములావామల్ కూడా ఉన్నారు. మౌల్వీ నజీర్ హుస్సేన్ మా నికాహ్‌ను నిర్వహించారు. ఈ సంఘటన 1302 హిజ్రీ సంవత్సరం ముహర్రం నెల 27వ తేదీన, సోమవారం జరిగింది. ఆ సమయంలో నా వయస్సు పద్దెనిమిది సంవత్సరాలు. నికాహ్ అనంతరం హజ్రత్ సాహిబ్ మౌల్వీ నజీర్ హుస్సేన్‌కు ఐదు రూపాయలు, ఒక నమాజు చాపను కానుకగా ఇచ్చారు." ఈ భవదీయుడు తెల్పునదేమనగా, ఆ సమయంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి వయస్సు దాదాపు యాభై సంవత్సరాలు ఉండి ఉంటుంది. హజ్రత్ అమ్మాజాన్ సాహిబా ఇలా చెప్పారు: "నా నికాహ్‌కు ఒకటిన్నర లేదా రెండు సంవత్సరాల ముందే మీ పెదనాన్న గారు మరణించారు." ఈ భవదీయుడు తెల్పునదేమనగా, మా పెదనాన్న గారు 1883వ సంవత్సరంలో మరణించారు. అది బరాహీన్-ఎ-అహ్మదీయా గ్రంథ రచన చివరి కాలం. హజ్రత్ అమ్మాజాన్ సాహిబా వివాహం నవంబర్ 1884లో జరిగింది. ఈ భవదీయుడికి తెలిసిన విషయమే మనగా, వివాహ తేదీ మొదట ఆదివారం నిర్ణయించబడింది. అయితే హజ్రత్ సాహిబ్ సూచన మేరకు దానిని సోమవారానికి మార్చారని హజ్రత్ అమ్మాజాన్ ద్వారా ఈ భవదీయుడికి తెలిసింది.

(70) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: ఖాజీ అమీర్ హుస్సేన్ గారు మాకు ఇలా తెలిపారు: "హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి కాలం ఎంతో అద్భుతమైనది. ఖాదియాన్‌లో వరుసగా రెండు రోజులు కూడా ఎండలు తీవ్రంగా ఉండేవి కావు. మూడవ రోజున వర్షం కురిసేది. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు మేము హజ్రత్ సాహిబ్‌తో, 'హుజూర్! చాలా వేడిగా ఉంది' అని చెప్పేవాళ్లం. అప్పుడు మరుసటి రోజే వర్షం కురిసేది." అలాగే మౌల్వీ సయ్యద్ సర్వర్ షా గారు కూడా ఇలా తెలిపారు: "ఆ కాలంలో పంటల విషయంలో కూడా ఎప్పుడూ ఎలాంటి ఫిర్యాదులు వినిపించేవి కావు." నేను ఇంటికి తిరిగి వచ్చి మా తల్లిగారితో ఈ విషయం ప్రస్తావించగా, వారు ఇలా అన్నారు: "హజ్రత్ సాహిబ్ 'ఈ రోజు చాలా వేడిగా ఉంది' అని చెప్పినప్పుడు, సాధారణంగా అదే రోజున లేదా మరుసటి రోజున వర్షం కురిసేది. కానీ వారి మరణానంతరం పరిస్థితి మారిపోయింది. నెలల తరబడి నిప్పులు కురిసినట్లుగా ఎండలు మండేవి, వర్షం మాత్రం కురిసేది కాదు." ఈ భవదీయుడు తెల్పునదేమనగా, హజ్రత్ సాహిబ్ వారి కాలంలో ఖాదియాన్‌లో వర్షం కోసం చేసే ప్రత్యేక నమాజ్ (సలాతుల్ ఇస్తిస్కా) ఎప్పుడూ నిర్వహించ బడలేదు. అయితే, వారి అనంతరం ఈ నమాజ్ పలుమార్లు నిర్వహించ బడింది. (ఈ వృత్తాంతానికి సంబంధించిన గమనిక: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి కాలంలో ఎప్పుడూ ఇస్తిస్కా నమాజు నిర్వహించబడలేదని నేను భావించాను. అయితే, ఆ అభిప్రాయం సరైనది కాదని తేలింది. రెండవ భాగంలోని 415వ వృత్తాంతాన్ని చూడండి. అయినప్పటికీ, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి కాలంలో ఖాదియాన్‌లో సాధారణంగా ఎక్కువ రోజులపాటు నిరంతరంగా తీవ్రమైన ఎండలు ఉండేవి కావనే నా అభిప్రాయం మాత్రం సరైనదే.)

(71) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: ఈ భవదీయుడు తెలియజేయునదేమనగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారికి ఉదయం వేళ బయటకు నడకకు వెళ్లడం ఒక సాధారణ అలవాటుగా ఉండేది. వారిన వెంట సేవకులు కూడా ఉండే వారు. అందరూ కలిసి ఒకటి లేదా రెండు మైళ్ల దూరం వరకు నడిచి వెళ్లేవారు.
హజ్రత్ సాహిబ్ చాలా వేగంగా నడిచేవారు. అయినప్పటికీ, వారి నడకలో పూర్తి గంభీరత, ఠీవి ఉండేవి. హజ్రత్ సాహిబ్ నడకకు వెళ్లేటప్పుడు హజ్రత్ మౌల్వీ సాహిబ్ (మొదటి ఖలీఫా) గారిని కూడా తనతో రావాలని పిలిచేవారు. అయితే, మౌల్వీ సాహిబ్ చాలా నెమ్మదిగా, మధ్యమధ్యలో ఆగుతూ నడిచేవారు. అందువల్ల కొంతదూరం నడిచిన తర్వాత హజ్రత్ సాహిబ్ కంటే వెనుకబడిపోయేవారు. హజ్రత్ సాహిబ్‌కు మౌల్వీ సాహిబ్ వెనుకబడిపోయారని తెలిసినప్పుడు, మౌల్వీ సాహిబ్ కోసం రోడ్డుపై కొద్దిసేపు ఆగి ఎదురుచూసేవారు. కానీ మౌల్వీ సాహిబ్ మరికొంత దూరం నడిచిన తర్వాత మళ్లీ వెనుకబడిపోయేవారు. అప్పుడు ఇద్దరు లేదా నలుగురు వ్యక్తులు మౌల్వీ సాహిబ్‌తో పాటు నడుస్తూ ఉండేవారు. హజ్రత్ సాహిబ్ నడకకు వెళ్లేటప్పుడు నవాబ్ ముహమ్మద్ అలీ ఖాన్ గారిని కూడా తనతో తీసుకువెళ్లేవారని నేను స్వయంగా చూశాను. అనేక సందర్భాల్లో హజ్రత్ సాహిబ్ తన ఇంటి నుంచి బయటకు వచ్చి, కూడలిలో తన సేవకులతో కలిసి నవాబ్ సాహిబ్ కోసం ఎదురు చూస్తూ ఉండేవారు. కొన్నిసార్లు నవాబ్ సాహిబ్ రావడానికి ఆలస్యమయ్యేది. అప్పుడు హజ్రత్ సాహిబ్ ఆయన ఇంటి ద్వారం ఎదురుగా ఉన్న కూడలిలో చాలా నిమిషాల పాటు నిలబడి వేచి ఉండేవారు. ఆ తర్వాత ఆయనను వెంట తీసుకుని నడకకు వెళ్లేవారు. నడక సమయంలో హజ్రత్ సాహిబ్ తన సేవకులతో సంభాషిస్తూ ఉండే వారు. హజ్రత్ సాహిబ్ మాట్లాడుతూ, ప్రసంగిస్తూ ముందుకు సాగేవారు. వార్తా పత్రికలకు సంబంధించిన వ్యక్తులు తమకు తోచిన విధంగా వారి మాటలను నోటు చేసుకుంటూ ఉండేవారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సాధారణంగా నడక కోసం బస్రావాన్ మార్గం గుండా లేదా బోటర్ మార్గం గుండా వెళ్లేవారు. కొన్నిసార్లు తన తోట వైపునకు కూడా వెళ్లేవారు. అక్కడ మల్బరీ పండ్లు, విత్తనాలు లేని ఇతర పండ్లు మొదలైన వాటిని కోయించి, తన సేవకుల ముందు ఉంచించేవారు. వారు కూడ స్వయంగా వాటిని తినేవారు. నడక సమయంలో కొన్నిసార్లు ఎవరైనా అజాగ్రత్తగా నడిచినచో వారి కాలు హజ్రత్ సాహిబ్ చేతిలోని కర్రపై పడేది. అప్పుడు ఆ కర్ర వారి చేతిలో నుంచి కింద పడిపోయేది. అటువంటి సందర్భాల్లో, ఆ కర్ర ఎవరి వల్ల పడిపోయిందో చూడటానికి వారు ఎప్పుడూ వెనక్కి తిరిగి చూసేవారు కాదు. కొన్నిసార్లు సమావేశాలు లేదా ఇతర కార్యక్రమాల సమయంలో పెద్ద సంఖ్యలో ప్రజలు హజ్రత్ సాహిబ్ వెంట నడిచేవారు. అప్పుడు కొంతమంది సేవకులు తమంతట తాముగా ఒకరి చేతిని మరొకరు పట్టుకుని, హజ్రత్ సాహిబ్ చుట్టూ మూడు వైపులా ఒక వలయంలా ఏర్పడేవారు. అలా చేయడం వల్ల హజ్రత్ సాహిబ్‌కు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకునేవారు. అయితే, హజ్రత్ సాహిబ్ జీవించి ఉన్న సమయంలో జరిగిన చివరి సమావేశంలో ఒక ప్రత్యేకమైన సంఘటన జరిగింది. ఆ సమయంలో వారు బోటర్ (ఉత్తర దిశ) వైపు నడకకు బయలు దేరారు. వారి వెంట అంత పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చారు కాబట్టి, నడవడం కూడా కష్టమైపోయింది. అందువల్ల కొద్దిదూరం వెళ్లిన తర్వాత వారు తిరిగి వచ్చేశారు. నాకు గుర్తున్న మరో సంఘటన ఏమిటంటే, ఒకసారి హజ్రత్ సాహిబ్ బస్రావాన్ (తూర్పు దిశ) మార్గంలో నడక ముగించుకుని తిరిగి వస్తున్నారు. మార్గమధ్యంలో, ఖాదియాన్ నుంచి వెళ్తున్న మిర్జా నిజాముద్దీన్ వారికి ఎదురయ్యారు. ఆయన హజ్రత్ సాహిబ్‌కు వరుసకు సోదరుడు (పిన్నాన్న కుమారుడు), అయితే ఆయనకు హజ్రత్ సాహిబ్ పట్ల తీవ్ర వ్యతిరేకత ఉండేది. ఆ సమయంలో మిర్జా నిజాముద్దీన్ గుర్రంపై స్వారీ చేస్తున్నారు. హజ్రత్ సాహిబ్ వస్తుండటం చూసి ఆయన గుర్రం దిగారు. దారి పక్కకు వెళ్లి నిలబడ్డారు. హజ్రత్ సాహిబ్ ఆయన దగ్గరగా వెళ్లినప్పుడు, మిర్జా నిజాముద్దీన్ గౌరవపూర్వకంగా వంగి సలాం చేశారు. ఈ భవదీయుడు తెల్పునదేమనగా, ఎవరైనా వ్యక్తి హజ్రత్ సాహిబ్ పక్కనుంచి వెళ్తూ చేతిని పైకెత్తి సలాం చేసినప్పుడు, వారు కూడా దానికి ప్రతిస్పందనగా తన చేతిని పైకెత్తి సలాం చేసేవారు.

(సీరతుల్ మహ్దీ, సంపుటి 1, పేజి 51-54)

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz